# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 14-7-2021 | RNI No.52865/93-Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 283 | పేజీలు: 4 | వెల: రూ.1/-


## కేంద్ర కేబినెట్ కమిటీల్లో కీలక మార్పులు..



న్యూఢిల్లీ, జులై 13:కేంద్ర ప్రభుత్వం ఇటీవలే కేబినెట్ విస్తరణ జరిగిన విషయం తెలిసిందే?కేంద్ర మంత్రి వర్గంలోకి కొందరు కొత్తగా మంత్రి పదవులు చేపట్టగా మరికొందరు మంత్రి వర్గాన్ని వీడారు.. దీంతో దీంతో కేబినెట్ కమిటీలను ప్రధాని నరేంద్ర మోదీ ఈ రోజు పునర్వ్యవస్థీకరించారు. మోదీ నేతృత్వం వహిస్తున్న రాజకీయ వ్యవహారాల కేబినెట్ ఉప సంఘంలో స్మృతి ఇరానీతో పాటు మాండవీయ, భూపేంద్ర యాదవ్, వీరేంద్రకుమార్, గిరిరాజ్‌సింగ్, అర్జున్ ముండా, సోనోవాల్ ఉన్నారు. అలాగే పలు కమిటీల్లో కొందరు కొత్త మంత్రులు చేరగా, మరికొన్ని కమిటీల్లో మార్పులు లేవు.

పార్లమెంటరీ వ్యవహారాల ఉప సంఘం: రాజ్‌నాథ్ సింగ్, అనురాగ్ ఠాకూర్, కిరణ్ రిజిజు, వీరేంద్ర కుమార్. ఇక నైపుణ్య వ్యవహారాల ఉప సంఘం: ఆర్సీపీ సింగ్, అశ్వనీ చౌబే, భూపేంద్ర యాదవ్, కిషన్ రెడ్డి. భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ (ఎలాంటి మార్పులు లేవు): మోదీ, రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, నిర్మలా సీతారామన్, జైశంకర్ కొనసాగుతున్నారు.

## అన్ని వేరియంట్లను అడ్డుకుంటున్న స్పుత్నిక్ వి..

న్యూఢిల్లీ, జులై 13:స్పుత్నిక్ వి వ్యాక్సిన్ కరోనా అన్ని వేరియంట్లను అడ్డుకుంటున్నట్లు గమలేయా నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఆఫ్ ఎపిడమాలజీ వెల్లడించింది. రష్యాకు చెందిన స్పుత్నిక్ వి వి డెల్టా సహా కరోనా అన్ని వేరియంట్లపై సమర్ధవంతంగా పనిచేస్తుందని తాజా అధ్యయనం తెలిపింది. నేరుగా వైరస్‌నే ఉపయోగించి చేసిన వైరస్ న్యూట్రలైజింగ్ యాక్టివిటీ (వీఎన్ఏ)ని అంచనా వేసి ఈ అధ్యయనం జరిగినట్లు తెలిపింది. కరోనా తొలి వేరియంట్ అయిన బీ.1.1.1 సహా ప్రపంచంలోని వివిధ దేశాల్లో కనిపించిన వేరియంట్లను స్పుత్నిక్ వి వ్యాక్సిన్ ప్రేరిత సేరా ఎలా అడ్డుకుంటుందో పరిశీలించారు.

అంతేకాదు ఇతర వ్యాక్సిన్ ఉత్పత్తిదారులతో కలిసి వ్యాక్సిన్ కాక్టయిల్స్‌ను తయారు చేసే దిశగా గమలేయా, ఆర్డీఐఎఫ్ అధ్యయనం నిర్వహిస్తోంది. ఇండియా సహా ప్రపంచంలోని మొత్తం 67 దేశాల్లో స్పుత్నిక్ వి వ్యాక్సిన్ రిజిస్టర్ అయింది. ఇండియాలో ఈ మధ్యే ఈ వ్యాక్సిన్‌ను ఇవ్వడం ప్రారంభించారు. ఆల్ఫా బీ.1.1.7 (తొలిసారి యూకేలో కనిపించింది), బీటా బీ.1.351 (తొలిసారి సౌతాఫ్రికాలో కనిపించింది), గామా పీ.1 (బ్రెజిల్‌లో కనిపించింది), డెల్టా బీ.1.617.2, బీ.1.617.3 (ఇండియాలో కనిపించింది) వేరియంట్లను అడ్డుకునే టైటర్లను స్పుత్నిక్ వి వ్యాక్సిన్ ఉత్పత్తి చేసినట్లు గమలేయా ఇన్‌స్టిట్యూట్ వెల్లడించింది.

## హిల్ స్టేషన్స్‌లో మాస్కులు లేకుండా గుమిగూడటం ఆందోళనకరం: ప్రధాని

న్యూఢిల్లీ, జులై 13:కరోనా సెకండ్ వేవ్‌లా థర్డ్ వేవ్ కూడా విజృంభించకుండా నిలువరించాలంటే దేశంలో వ్యాక్సినేషన్ ప్రక్రియ వేగవంతం కావాలని ప్రధాని నరేంద్రమోదీ అభిప్రాయపడ్డారు. దేశంలో కరోనా పరిస్థితిపై ఈశాన్య రాష్ట్రాల ముఖ్యంత్రులతో ప్రధాని మోదీ ఇవాళ సమీక్షా సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యమంత్రులతో మాట్లాడుతూ.. దేశంలో కరోనా పాజిటివ్ కేసులు రోజురోజుకు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తుందన్నారు.

పరిస్థితి చేయిదాటక ముందే మనం మహమ్మారి పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు.

అదేవిధంగా కరోనా మహమ్మారి అనేక రూపాలు సంతరించుకుంటున్నదని, వాటిపై మనం ఓ కన్నేయాల్సిన అవసరం ఉన్నదని ప్రధాని అభిప్రాయపడ్డారు. కరోనా వేయింట్లపై నిపుణులు అధ్యయనం చేస్తున్నారని, మనందరం కూడా కరోనా నిబంధనలు పాటించడంతోపాటు ప్రజలు కూడా పాటించేలా ప్రోత్సహిద్దామని ఆయన ఈశాన్య రాష్ట్రాల ముఖ్యమంత్రులకు సూచించారు. కరోనా థర్డ్ వేవ్ ప్రబలకుండా కట్టడి చేయాలంటే వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగిరం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాల్లోని కొండ ప్రాంతాలకు వచ్చే పర్యాటకులు కరోనా నిబంధనలను సరిగా పాటించడంలేదని, ఇది ఆందోళనకరమైన విషయమని ముఖ్యమంత్రులతో ప్రధాని వ్యాఖ్యానించారు. హిల్ స్టేషన్స్‌కు వచ్చే పర్యాటకులలో చాలా మంది ఫేస్ మాస్కులు ధరించడంలేదని, సామాజిక దూరం కూడా పాటించడం లేదని ప్రధాని చెప్పారు. హిల్ స్టేషన్స్‌లో, మార్కెట్‌లలో ఫేస్ మాస్కులు లేకుండా జనం భారీ సంఖ్యలో గుమిగూడటం మంచిది కాదని, ప్రజలు తూచా తప్పకుండా కరోనా నిబంధనలు పాటించేలా చూడాలని ముఖ్యమంత్రులకు సూచించారు.

## నగర శివారులో మంచినీటి సమస్య పరిష్కారానికి రూ.1200 కేటాయించిన సీఎం కేసీఆర్

హైదరాబాద్ , జులై 13:సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రగతి భవన్‌లో మంగళవారం రాష్ట్ర మంత్రి మండలి సమావేశమైంది. ఈ సందర్భంగా నగర శివారులోని మున్సిపాలిటీల్లో మంచినీటి సమస్యపై కేబినెట్ చర్చించింది.

సమస్య పరిష్కారానికి సీఎం కేసీఆర్ రూ.1200 కోట్లు మంజూరు చేశారు.

నీటి ఎద్దడి నివారణకై తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

అలాగే కేబినెట్‌కు పల్లె, పట్టణ ప్రగతిపై పంచాయతీరాజ్ శాఖ, మున్సిపల్ శాఖలు నివేదికలు సమర్పించాయి. రాష్ట్రంలో వైకుంఠధామాలను వందకు వందశాతం నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు.

ఇకపై గ్రామాల్లో వీధి దీపాల కోసం ప్రత్యేకంగా మూడో వైర్‌ను తప్పకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రస్తుతం కేబినెట్ సమావేశం కొనసాగుతున్నది.

## తెలంగాణ వర్సిటీని సందర్శించిన డెప్యూటీ కలెక్టర్ సంతోషి



హైదరాబాద్ , జులై 13: ఇటీవల డెప్యూటీ కలెక్టర్‌గా నియామకమైన కల్నల్ సంతోష్‌బాబు సతీమణి బీ సంతోషి మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. రాష్ట్రంలో వ్యవసాయరంగం, వ్యవసాయ విశ్వవిద్యాలయాల కార్యకలాపాలపై అవగాహన పెంచుకునేందుకు ఆమె వర్సిటీని సందర్శించారు. వర్సిటీకి చేరుకున్న సంతోషికి వైస్ చాన్సలర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం పరిపాలనా భవనంలోని కమిటీ హాలులో ఉప కులపతి డాక్టర్ వీ ప్రవీణ్‌రావుతో పాటు విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కార్యకలాపాలను ప్రవీణ్‌రావు ఆమెకు వివరించారు. రాష్ట్రంలో వరి, మొక్కజొన్న, పత్తి, కంది, వేరుశనగ వంటి ప్రధాన పంటలు సాగు చేస్తున్నామని, వరి పంటలో అధిక ఉత్పత్తి సాధించగా.. ప్రస్తుతం విలువ జోడింపుపై దృష్టి పెట్టినట్లు ఆమెకు వివరించారు. అలాగే పత్తిలో అధిక సాంద్రత కలిగిన నూతన రకాల (వంగడాలు) రూపకల్పనకు శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారని తెలిపారు. ఏర్పాటైన అనతికాలంలోనే ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం దేశంలోనే టాప్ 10 వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా నిలిచిందని వివరించారు.

ప్రస్తుతం వ్యవసాయ విశ్వవిశ్వవిద్యాలయం, వ్యవసాయంలో ఎమర్జింగ్ టెక్నాలజీస్ అమలు కోసం ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీస్, రోబోటిక్స్‌పై అగ్రిహబ్ ద్వారా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆమె రాజేంద్రనగర్‌లోని పలు ప్రయోగశాలలను, పరిశోధనా కేంద్రాలను సందర్శించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్ సుధీర్ కుమార్‌తో పాటు విశ్వవిద్యాలయ అధికారులు పాల్గొన్నారు.

## మంత్రి కేటీఆర్‌ను కలిసిన సింగపూర్ హైకమిషనర్



హైదరాబాద్ , జులై 13: తెలంగాణ రాష్ట్రంలో నూతన రంగాల్లో అనేక పెట్టుబడి అవకాశాలు ఉన్నాయని, ఈ అవకాశాలను సింగపూర్ కంపెనీలకు, పెట్టుబడిదారులకు పరిచయం చేయడంలో సహకారం అందిస్తామని భారతదేశంలో సింగపూర్ హై కమిషనర్ సిమోన్ వాంగ్ అన్నారు. ఒకవైపు ఆధునిక రంగాలలో పెట్టుబడులతో పాటు అగ్రికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లోనూ సింగపూర్ కంపెనీలు ఇక్కడ ఉన్న అవకాశాల పట్ల ఆసక్తితో ఉన్నాయని వాంగ్ తెలిపారు.

ప్రగతి భవన్‌లో పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌తో సింగపూర్ హైకమిషనర్ సిమోన్ వాంగ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌తో పాటు తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను, వివరాలను వాంగ్‌కు కేటీఆర్ అందించారు. హైదరాబాద్ నగరం కొన్ని వందల సంవత్సరాల నుంచి దేశంలోని ఇతర నగరాలకు భిన్నంగా కాస్మోపాలిటన్ స్వభావంతో అభివృద్ధి చెందుతూ వస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. అద్భుతమైన ప్రభుత్వ విధానాలతో పాటు టీఎస్ ఐపాస్, సింగిల్ విండో అనుమతుల వంటి వాటితో అనేక అంతర్జాతీయ పెట్టుబడులను తెలంగాణకు తీసుకురాగలిగామన్నారు.

లైఫ్ సైన్సెస్, ఫార్మా, ఐటీ, టెక్స్‌టైల్, ఫుడ్ ప్రాసెసింగ్, అగ్రికల్చర్ వంటి పలు రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే అనేక సింగపూర్ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి తమ కార్యకలాపాల పట్ల సానుకూలంగా ఉన్నాయని కేటీఆర్ చెప్పారు.

తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టిన డిబిఎస్ వంటి కంపెనీలు, తమకు ఇక్కడ ఉన్న వాతావరణం గురించి సానుకూల ఫీడ్ బ్యాక్‌ను అందించాయని మంత్రి కేటీఆర్‌కు హై కమిషనర్ వాంగ్ వివరించారు. సింగపూర్ కంపెనీలు ఐటీ, ఇన్నోవేషన్, ఐటీ అనుబంధ రంగాల్లో ఉన్న బ్లాక్ చైన్ వంటి నూతన రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు చొరవ చూపిస్తున్నాయని వాంగ్ తెలిపారు. హైదరాబాదులో ఉన్న టీ హబ్ వంటి కార్యక్రమాల ద్వారా ఇక్కడ ఉన్న ఐటీ ఈకోసిస్టం, ఇన్నోవేషన్ సిస్టం గురించి సానుకూలతలు తెలుసన్నారు. ఒకవైపు ఆధునిక రంగాలలో పెట్టుబడులతో పాటు అగ్రికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లోనూ సింగపూర్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తితో ఉన్నాయని వాంగ్ స్పష్టం చేశారు.

### సింగపూర్ హబ్ ఏర్పాటు చేసేందుకు సిద్ధం

సింగపూర్ కంపెనీలు ముందుకు వస్తే తెలంగాణలో ప్రత్యేకంగా సింగపూర్ పెట్టుబడుల కోసం ఒక ప్రత్యేక జోన్ లేదా సింగపూర్ హబ్ ఏర్పాటు చేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందని కేటీఆర్ ప్రతిపాదించారు. సింగపూర్ పెట్టుబడులకు ప్రత్యేకంగా ఒక హబ్ ఏర్పాటు చేస్తామనడం ఒక గొప్ప ఆలోచన అని వాంగ్ అన్నారు. గతంలో తాను వియత్నాంలో పని చేసినప్పుడు ఇలాంటి ఒక ప్రయత్నం చేసి.. అనేక పెట్టుబడులను ఆకర్షించిందన్నారు. ఇప్పుడు వియత్నాంలో సింగపూర్ పెట్టబడులు విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ సమావేశం అనంతరం హై కమిషనర్ సిమోన్ వాంగ్‌తో పాటు చెన్నైలో సింగపూర్ కౌన్సిల్ జనరల్ పొంగ్ కాక్ టియన్‌లను మంత్రి కేటీఆర్ శాలువాలతో సత్కరించారు.

## మొబైల్ ఫోన్లు అపహరణకు గురైతే మీ సేవలో ఫిర్యాదు చేయాలి : సీపీ

హైదరాబాద్ , జులై 13: నగరంలోని పాతబస్తీ పరిధిలో చోరీకి గురైన 66 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తిరిగి వాటిని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ మంగళవారం బాధితులకు అప్పగించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ ఫోన్లు చోరీకి గురైతే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు. మీ సేవ, హాక్ ఐ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

ఫోన్లు రికవరీ చేసిన అనంతరం వెంటనే బాధితులకు సమాచారం ఇస్తామన్నారు. ధ్రువీకరణపత్రాలు కోల్పోతే మీ సేవలో దరఖాస్తు చేయాలని చెప్పారు. ఇతర దేశాల వీడియోలను హైదరాబాద్‌లో జరిగినట్లు ప్రచారం చేస్తున్నారని సీపీ పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

## టీకాల కొరతతో వ్యాక్సినేషన్ కేంద్రాల మూత

న్యూఢిల్లీ, జులై 13: మరో రెండు నెలల్లో కరోనా థర్డ్ వేవ్ పొంచి ఉందన్న ఆందోళనల నడుమ దేశ రాజధానిలో మరోసారి టీకాలకు కొరత ఏర్పడిందని ఢిల్లీ ఆరోగ్య శాఖ మంత్రి సత్యేందర్ జైన్ పేర్కొన్నారు.

టీకాల కొరత వెంటాడటంతో వ్యాక్సినేషన్ కేంద్రాలను పదేపదే మూసివేయాల్సి వస్తోందని జైన్ చెప్పారు. వ్యాక్సిన్ నిల్వలు అందుబాటులో లేవని, సోమవారం తమకు సరఫరా చేసిన 1.5 లక్షల కొవిషీల్డ్ వ్యాక్సిన్లు బుధవారం వరకూ వాడేందుకు సరిపోతాయని ఆపై వ్యాక్సినేషన్ కేంద్రాలను మూసివేయాల్సిన పరిస్థితి నెలకొందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు.

వ్యాక్సిన్ల కొరతతో వ్యాక్సినేషన్ కేంద్రాలను పలుమార్లు మూసివేయాల్సి వస్తోందని చెప్పుకొచ్చారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం కేవలం ఒకటి రెండు రోజులకు సరిపడా వ్యాక్సిన్లను పంపుతుంటే మిగిలిన రోజుల్లో వ్యాక్సినేషన్ కేంద్రాలను మూసివేస్తున్నామని ఢిల్లీ అధికారులు వెల్లడించారు. ఇక టీకాల ప్రక్రియ ప్రారంభమై నెలలు గడుస్తున్నా మన వ్యాక్సినేషన్ ప్రక్రియ ఇంకా ఎందుకు ముందుకు సాగడంలేదని ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా ట్వీట్ చేశారు.

## గోల్డ్ గెలిస్తే ఆరు కోట్లు : సీఎం యోగి

వారణాసి, జులై 13:: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఇవాళ ఒలింపిక్ అథ్లెట్లకు నజరానా ప్రకటించారు. గోల్డ్ మెడల్ గెలిచే విజేతలకు తమ రాష్ట్రం ఆరు కోట్ల నగదు ఇస్తుందన్నారు. టీమ్ ఈవెంట్లలో స్వర్ణం గెలిచే క్రీడాకారులకు మూడేసి కోట్లు ఇవ్వనున్నట్లు సీఎం యోగి వెల్లడించారు. ఈనెల 23వ తేదీ నుంచి టోక్యోలో ఒలింపిక్స్ క్రీడలు ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొన భారత క్రీడాకారుల్లో .. పది మంది ఆటగాళ్లు యూపీకి చెందినవాళ్లే ఉన్నారు. షూటర్ సౌరభ్ చౌదరీ యూపీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సింగిల్స్, టీమ్ ఈవెంట్లలో పాల్గొంటున్న ప్రతి క్రీడాకారిడికి 10 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు సీఎం యోగి వెల్లడించారు. అంతకముందు ఆయన వారణాసిలో కాశీ విశ్వనాథుడికి అభిషేకం చేశారు.


చరిత్రలో నేటినిజం





## రైతుల ఆందోళన కొనసాగుతది: రాకేష్ తికాయిత్

న్యూఢిల్లీ, జులై 13: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వివాదాస్పద సాగు చట్టాలకు వ్యతిరేకంగా రైతుల ఆందోళన కొనసాగుతదని భారతీయ కిసాన్ యూనియన్ (బీకేయూ) నేత రాకేష్ తికాయిత్ స్పష్టంచేశారు. తాము నెలల తరబడి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన ఆయన వ్యాఖ్యానించారు. రైతుల సమస్యపై మాట్లాడటం కేంద్ర ప్రభుత్వానికి ఇష్టంలేదని ఆయన చెప్పారు.

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుగనుండటంతో ఇక తాము పార్లమెంటు ముందు నిరసన వ్యక్తం చేయాలని నిర్ణయించామని రాకేష్ తికాయిత్ తెలిపారు. రోజుకు 200 మంది చొప్పున ఢిల్లీకి వెళ్లి ఈ నెల 22న పార్లమెంట్ బయట ఆందోళనకు దిగుతామని ఆయన స్పష్టంచేశారు.

## కేంద్రం అసమర్థ విధానాలతోనే ధరల మంట : చిదంబరం

న్యూఢిల్లీ, జులై 13: కేంద్ర ప్రభుత్వ అసమర్ధ విధానాలతోనే దేశంలో ధరలు మండిపోతున్నాయని, ద్రవ్యోల్బణం ఎగబాకుతోందని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి పీ చిదంబరం ఆరోపించారు. ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో మోదీ సర్కార్ లోపభూయిష్టంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇంధన ధరలు, ఇతర వస్తువుల ధరలు చుక్కలు చూస్తున్నా కేంద్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందని ఆరోపించారు.

పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలను తక్షణమే తగ్గించాలని, వీటిపై దిగుమతి సుంకాలను సమీక్షించాలని చిదంబరం మంగళవారం డిమాండ్ చేశారు. ద్రవ్యోల్బణానికి ప్రధాని నరేంద్ర మోదీయే నేరుగా బాధ్యత వహించాలని అన్నారు. ప్రభుత్వ తప్పుడు విధానాలు, ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో చేతకానితనం వల్లే ధరలు మండుతున్నాయని వ్యాఖ్యానించారు. ధరల పెరుగుదలపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు.

## సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులు



వరంగల్, జులై 13:: వరంగల్ అర్బన్ జిల్లాను హన్మకొండ జిల్లాగా వరంగల్ రూరల్ జిల్లాను వరంగల్ జిల్లాగా పేరును సవరించారు. ఈ మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజా ప్రతినిధులు, మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, ఆరూరి రమేశ్, శంకర్ నాయక్, టి రాజయ్య, చల్లా ధర్మారెడ్డి సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాల అభివృద్ధికి మరింత సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# డ్రోన్-టెక్నాలజీ ఆధారిత ఉగ్రవాద ఉరుములు..!

**(ఇటీవల జమ్ము ఏయిర్‌ఫోర్స్ స్టేషన్లో డ్రోన్ల రూపంలో విధ్వంసకర విస్ఫోటన నేపథ్యంలో)**

26 జూన్ 2021 రోజు రాత్రి 2 గంటల ప్రాంతంలో సరిహద్దులకు 14 కిమీ దూరంలోని జమ్ము ఏయిర్‌ఫోర్స్ స్టేషన్లో అకస్మాత్తుగా విష్ఫోటనం సంభవించింది. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలు డ్రోన్ సహాయంతో జారవిడిచిన ఐఈడి (ఇంప్రూవ్డ్ ఎక్సప్లోజ్యువ్ డివైస్) విస్ఫోటన పదార్థ (ఆర్‌డిఎక్స్ ఒ నైట్రేట్) పేలిన ఫలితంగా భద్రత గోడలకు బీటలు ఏర్పడి దేశ రక్షణరంగాన్ని విస్మయానికి గురిచేసింది. పాకిస్థానీ ఉగ్రవాద సమూహాలు అంతర్జాతీయ సరిహద్దులు దాటుతూ మన రక్షక వ్యవస్థ ఏర్పాటు చేసిన కట్టుదిట్టమైన భద్రతలను ఛేదించుకుంటూ, డ్రోన్‌ల సహాయంతో రెండు విస్ఫోటన పదార్థాలను ఏయిర్ ఫోర్స్ స్టేషన్‌లో విడవడం, విస్ఫోటనానికి టెక్నికల్ సెక్షన్ భవనం ధ్వంసం కావడం, ఓపెన్ ఏరియాలో రెండవ విస్ఫోటనం పేలడం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఈ ఘటనలో తొలిసారి ఇద్దరు ఏయిర్‌ఫోర్స్ సిబ్బంది గాయపడడం జరిగిందని అంచనా వేస్తున్నారు. దేశ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ లడక్ పర్యటనకు కొన్ని గంటలకు ముందు డ్రోన్ బాంబుల ఘటన జరగడం సమస్య గంభీరతను తెలియజేస్తున్నది. ఇలాంటి అత్యాధునిక డ్రోన్-టెక్నాలజీ ఆధారిత ఉగ్రవాద/విదేశీ దాడులు భవిష్యత్ యుద్ధ మేఘాలను ఊహకందనంతగా మార్చి వేయనున్నాయని అవగతం అవుతున్నది. భారత రక్షక వ్యవస్థలో అంతర్భాగమైన అత్యాధునిక రేడార్, మెసైల్ వ్యవస్థలు ఏయిర్‌క్రాఫ్ట్‌లు, హెలీకాప్టర్లు, మానవరహిత ఏరియల్ వాహనాలను గుర్తించి విధ్వంసం చేయగలిగే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. ఈ రేడార్ పరిజ్ఞానంతో చిన్న సైజులో ఉండే డ్రోన్లను గుర్తించలేవనేది వాస్తవంగా తెలుస్తున్నది. జమ్ములో ప్రయోగించిన డ్రోన్ అనేక భద్రతా వలయాలను దాటుతూ మి-18 హెలీకాప్టర్లు, రవాణ ఏయిర్‌క్రాఫ్ట్‌లను లక్ష్యంగా చేసుకొని చేరగలిగింది. ఇలాంటి డ్రోన్లను గుర్తించి విధ్వంసం చేయగల టెక్నాలజీ మన రక్షణ వ్యవస్థలో నేటికీ అందుబాటులో లేకపోవడం విచారకరం. ఈ విస్ఫోటనంతో డ్రోన్ చొరబాటు, విస్ఫోటన ప్రభావం, సిగ్నల్ లింక్, క్షేత్ర స్పందన లాంటి ముఖ్య అంశాలను శత్రుమూకలు తెలుసుకోగలిగాయని అర్థం అవుతున్నది. ఈ డ్రోన్ విస్ఫోటనం జరిగిన 24-గంటల్లోనే జమ్ములోని కలుచక్, రత్నుచక్ మిలిటరీ స్టేషన్ల సమీపాన మరో రెండు డ్రోన్ విస్ఫోటనాలు కూడా గుర్తించబడ్డాయి. గతంలో సరిహద్దులను దాటుతూ డ్రోన్ల సహాయంతో ఉగ్రవాదులు ఆయుధాలను జారవేసిన ఘటనలు పలు సార్లు జరగడం, వీటిని మన రక్షక బలగాలు గుర్తించడం జరిగింది.

1935లో తొలిసారి 'డీ హవీలాం డ్' అనే శాస్త్రజ్ఞుడు రేడియో-నియంత్రిత డ్రోన్ వాడారు. 1951లో 'అబ్రాహమ్ కరిమ్' (ఫాదర్ ఆఫ్ డ్రోన్ టెక్నాలజీ) కృషితో 'అన్‌మ్యాన్డ్ ఏరియల్ వెహికిల్ (యుఏవి) టెక్నాలజీ'ని రూపొందించారు. భారతదేశంలో తొలిసారి భారత త్రివిధ దళాలు 1990ల్లో డ్రోన్ టెక్నాలజీని వాడడం మె?దలు పెట్టారు. నేడు దేశవ్యాప్తంగా అభిరుచి కలిగిన వృత్తి నిపుణులు చిన్న సైజ్, చవకైన, సులభంగా లభించే డ్రోన్లు వాడడం సర్వసాధారణమైంది. ప్రభుత్వ గుర్తింపు కలిగిన 24,000 డ్రోన్లు ప్రస్తుతం సామాన్య జనుల వద్ద వాడుకలో ఉన్నాయి. వీటిని నిఘా, ఇమేజింగ్, నష్ట అంచనా, వస్తు రవాణా లాంటి సేవలకు వినియోగించుట జరుగుతున్నది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం తొలి ప్రయత్నంగా రవాణా వ్యవస్థలు లేని మారుమూల గిరిజన ప్రదేశాలకు అత్యవసర ఔషధాలు, రక్త యూనిట్లు అందించే లక్ష్యంతో డ్రోన్లను రిమోట్ కంట్రోల్ ద్వారా వాడడం చూశాం. నేడు దేశ రక్షణ వ్యవస్థ, వ్యాపార వాణిజ్య రంగం, పోలీస్ యంత్రాంగం, సాధారణ జనం వాడుతున్న డ్రోన్ల మార్కెట్ 3 లక్షల కోట్లు ఉండవచ్చని అంచనా. డ్రోన్ల ప్రయోగంతో దేశ రక్షణ వ్యవస్థలోని ముఖ్య సున్నిత సంస్థాపనలు అతి ప్రమాదంలో పడ్డాయనే నిర్ధారించాలి. ప్రస్తుతం అమలవుతున్న నియమాలను బట్టి 250 గ్రామ్‌లకు మించిన బరువున్న డ్రోన్లను వాడకానికి సివిల్ ఏవియేషన్ శాఖ అనుమతులు తప్పనిసరి తీసుకోవాల్సి ఉంది.

మన రక్షణరంగ భద్రత వ్యవస్థ వెంటనే ఆంటీ-డ్రోన్ టెక్నాలజీ సహాయంతో ఆకాశ కంచెలు (స్కై ఫెన్స్‌లు), డ్రోన్లను కూల్చగల గన్లు, డ్రోన్‌లను పట్టుకోగల సాంకేతికత(డ్రోన్ క్యాచర్స్)లను స్వంతం చేసుకోవలసి ఉంది. ఇటీవలే భారత నావీ కొనుగోలు చేసిన ఇజ్రాయిలీ 'స్మాష్-2000 ఫైర్ కంట్రోల్' వ్యవస్థల సహాయంతో డ్రోన్ల దాడిని గుర్తించవచ్చు. మన దేశ డిఆర్‌డిఓ రూపొందించిన ఆంటీ-డ్రోన్ టెక్నాలజీని ఇండిపెండెన్స్ డే ఉత్సవాల్లో రెడ్ ఫోర్ట్ వద్ద ప్రధాని భద్రతకు కూడా వాడడం జరిగింది. తక్కువ ఎత్తులో, తేలికైన డ్రోన్లు వాడినపుడు వాటిని మన రేడార్లు గుర్తించలేక పోతున్నాయి. రేడియో తరంగాలు, జిపియస్, మెబైల్ - డ్రోన్ల మధ్య సిగ్నల్స్‌ను అడ్డుకోగల జామర్స్ మన వద్ద ఉన్నాయి. శత్రువు ప్రయోగించగల డ్రోన్లను గుర్తించి అత్యాధునిక వలలతో పట్టుకోగల డ్రోన్ క్యాచర్స్, డ్రోన్లను కూల్చగల గన్స్ వాడుకలోకి తీసునురావలసి ఉంది. 3 కేజీల బరువు కలిగిన డ్రోన్లను 2 కిమీ దూరం నుంచి కూడా ధ్వంసం చేయగల ఆంటీ-డ్రోన్ వ్యవస్థలు వాడాల్సిందే. దేశీయ డిఆర్‌డిఓ రూపొందించిన లేజర్ ఆధారిత ఆంటీ-డ్రోన్ వ్యవస్థలను పెద్ద ఎత్తున తయారు చేయవల్సిన సమయం ఆసన్నమైంది. దేశ రక్షణ రంగంపై మె?దటి సారి జరిగిన డ్రోన్ ఆధారిత విస్ఫోటన ఘటనను ఉగ్రవాదుల తీవ్ర హెచ్చరికగా భావించి నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజన్సీ, యన్ఐఏ లోతైన దర్యాప్తు చేసి, దేశాన్ని అస్థిర పరచాలనుకే విదేశీ శత్రుమూకల పథకాలను వమ్ము చేస్తూ, మన త్రివిధ దళాల భద్రతకు పట్టంకట్టే అత్యవసర ఆంటీ-డ్రోన్ టెక్నాలజీలను సమకూర్చుకొని, అభేద్య భారతాన్ని నిర్మించే ప్రయత్నాలు చేయాలని కోరుకుందాం.

-డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

# హుజురాబాద్ లో మూడు ముక్కలాట.. ఉపఎన్నిక రెఫరెండం

హైదరాబాద్ , జులై 13:హుజురాబాద్ ఉపఎన్నికల్లో గెలుపు కోసం మూడు ప్రధాన పార్టీలు శాయశక్తుల కృషి చేస్తున్నాయి. హుజురాబాద్ సీటును కైవసం చేసుకునేందుకు టీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు వ్యూహాలకు పదను పెట్టాయి. ఈ ఉప ఎన్నిక రానున్న అసెంబ్లీ ఎన్నికలకు రెఫరెండంగా మారునుందని అంచనా వేస్తున్నారు. దీంతో ఈ మూడు పార్టీలు హుజురాబాద్ ఉపఎన్నికను సవాల్ గా మారింది.

ఉప ఎన్నికకు ఇంకా నోటిఫికేషన్ కూడా రాక ముందే బీజేపీ అభ్యర్థి, మాజీ మంత్రి ఈటల రాజేందర్ ఇప్పటికే హుజురాబాద్ నియోజకవర్గాన్ని ఓ రౌండ్ చుట్టేశారు. బీజేపీ రథంలో గ్రామ, గ్రామాలకు తిరుగుతున్నారు. బీజేపీ సంగతి పక్కన బెడితే అభ్యర్థి విషయంలో టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఏటూ తేల్చుకోలేకపోతున్నాయి. ఈటలకు ధీటైన అభ్యర్థిగా కోసం ఈ రెండు పార్టీలు కసరత్తు చేస్తున్నాయి. టీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే కడియం శ్రీహరి, ఎల్.రమణ సహా పలువురి పేర్లు పరిశీలించింది. అయితే, కాంగ్రెస్ నేత కౌశిక్ రెడ్డి.. టీఆర్ఎస్ టికెట్ తనకే అని చెబుతున్న ఆడియో వైరల్ కావడంతో, అనంతరం ఆయన పార్టీకి రాజీనామా చేయడంతో టీఆర్ఎస్ అభ్యర్థిగా కౌశిక్ రెడ్డినే ప్రకటిస్తారా? లేక మరెవరికైన ఇస్తారా? అన్నది ఉత్కంఠగా మారింది.

గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరుపున పోటీ చేసిన కౌశిక్ రెడ్డి రాజీనామా చేయడంతో ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎవరికి టికెట్ ఇస్తుంది? అన్నది ఆసక్తి రేపుతోంది. కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఇంటి దొంగలు ఇప్పుడే బయటకు వెళ్లిపోవాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఈ క్రమంలో కొత్త అభ్యర్థి కోసం కాంగ్రెస్ అన్వేషిస్తోంది. పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ను అభ్యర్థిగా దింపాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది. దీంతో హుజురాబాద్ ఉప ఎన్నికల ఈ మూడు పార్టీలకు హుజురాబాద్ ఉపఎన్నిక చావోరేవో అన్నట్లు మారింది. ఇప్పుడు వచ్చే ఫలితం.. అసెంబ్లీ ఎన్నిలపై ప్రభావం చూపుతుందని భావిస్తున్నాయి. అందుకే, హుజురాబాద్ ఉపఎన్నికను రెఫరెండంగా మారనుంది.

# సీల్లోని 139 కులాలకు సమతుల్యత: మంత్రి



అమరావతి, జులై 13:రాష్ట్రంలో బీసీల్లోని 139 కులాలకు సమతుల్యత పాటించే ఏకైక పార్టీ వైఎస్ఆర్సీపీ అని బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యలయంలో ప్రభుత్వ సలహాదారులు సజ్జాల రామకృష్ణ రెడ్డితో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బలహీనవర్గానికి ఆస్తులు ఉండవని, వృత్తులు ఉంటాయన్నారు. ఆ వృత్తులను ప్రోత్సహించి సంరక్షించే బాధ్యత వైసీపీ ప్రభుత్వం తీసుకుందన్నారు. సీఎం జగన్ సంక్షేమ పాలనను చూసి కొంతమంది ఓర్వలేకపోతున్నారని అన్నారు. దుష్ప్రచారాలను మనందరం కలిసి తిప్పి కొట్టాలన్నారు. దుర్గ గుడి నాయి బ్రాహ్మణుల తోకలు కత్తిరిస్తాను అని చంద్రబాబు దుర్బాషలాడారని మండిపడ్డారు. అదే నాయి బ్రాహ్మణి మహిళను దుర్గ గుడిలో డైరక్టర్ చేసి వారి ఆత్మగౌరవం నిలిపిన నాయకులు సీఎం జగన్ అని తెలిపారు. బలహీన వర్గాల ఆత్మగౌరవం నిలిపే దిశగా పాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రికి ఓ బలహీనవర్గానికి చెందిన వ్యక్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నానని చెప్పారు. చంద్రబాబు హయంలో రాష్ట్రం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. సీం జగన్ పాదయాత్రలో 139 కులాల కోసం ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా పాలన కొనసాగిస్తున్నారని చెప్పారు. భావితారాల భవిష్యత్తు గురించి ఆలోచించే ఏకైక సీఎం జగన్ మాత్రమేనని పేర్కొన్నారు.

# సీఎం జగన్ పోలవరం పర్యటన వాయిదా..

అమరావతి, జులై 13:రేపు పోలవరం ప్రాజెక్టు సందర్శించాలని భావించిన ఏపీ సీఎం జగన్ తన పర్యటనను వాయిదా వేసుకున్నారు. ఈ మేరకు సీఎం క్యాంపు కార్యాలయం ఓ ప్రటకన చేసింది. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టు పనులను వేగంగా పూర్తిచేయాలని సీఎం జగన్ భావిస్తున్నారు. అందుకే రేపు పోలవరం సందర్శించి, పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష చేపట్టాలని నిర్ణయించుకున్నారు. ఇప్పుడు ఆయన పర్యటన వాయిదా పడిన నేపథ్యంలో, తిరిగి ఎప్పుడు పోలవరం వెళ్లాలనేది తదుపరి నిర్ణయించనున్నారు.

# ట్రైబ్స్ ఇండియా: రాబోయే రాఖీ పండుగ మరియు ఇతర బహుమతి అవసరాలకు ఒకే గమ్యస్థానం

న్యూఢిల్లీ, జులై 13:సున్నితమైన హస్తకళలు మొదలుకుని లోహ కళాఖండాలు, దుస్తులు మరియు సేంద్రీయ మూలికా ఉత్పత్తుల వరకు ఆకర్షణీయమైన మరియు విస్తృత శ్రేణి గిరిజన ఉత్పత్తులతో ట్రైబ్స్ ఇండియాలో (భౌతిక ఔట్‌లెట్ల నెట్‌వర్క్ మరియు ఆన్‌లైన్ ఇ-కామర్స్ ప్లాట్‌ఫాంలు రెండూ) మీ కుటుంబ సభ్యులు, మరియు స్నేహితులకు బహుమతులు అందించడానికి అవసరమైన అనేక ఎంపికలు అందుబాటులో ఉన్నాయి.

ట్రైబ్స్ ఇండియా కేటలాగ్‌లో ఇప్పుడు ప్రత్యేకమైన రాఖీలు అందుబాటులో ఉన్నాయి. భారతదేశంలోని వివిధ తెగలు చేతితో తయారు చేసిన ఆకర్షణీయమైన రాఖీలు, అలంకరించబడిన లోహ పూజా పెట్టెలు మరియు తోరన్స్ వంటి పూజా వస్తువులను కొనుగోలు చేయవచ్చు. ఇదే కాక పురుషులు మరియు మహిళలు ఇద్దరికీ రంగురంగుల కుర్తాలు, సల్వార్లు, వివిధ రకాల నేత మరియు శైలులలో జాకెట్లు, మరియు మహేశ్వరి, చందేరి, బాగ్, కాంత, భండారా, తుస్సార్, సంభల్‌పురి మరియు ఇకాట్‌లోని చీరలు, దుస్తులు మరియు అందమైన స్టోల్స్ సాంప్రదాయాలు మొదలైనవి ట్రైబ్స్ ఇండియా అవుట్‌లెట్‌లు మరియు వెబ్‌సైట్లలో అందుబాటులో ఉన్నాయి.

గిరిజనుల జీవనోపాధిని ప్రోత్సహించడానికి మరియు వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ మరియు అభివృద్ధి చేయడం ద్వారా వారిని శక్తివంతం చేయడానికి చేసిన ప్రయత్నాలకు అనుగుణంగా, ట్రైఫెడ్ ట్రైబ్స్ ఇండియా నెట్‌వర్క్‌లో అమ్మకానికి ఉన్న విభిన్న మరియు ఆకర్షణీయమైన ఉత్పత్తులను విస్తరిస్తోంది. 137 ట్రైబ్స్ ఇండియా అవుట్‌లెట్‌లు మరియు ఇ-కామర్స్ ప్లాట్‌ఫాం (లిలిలి.బితీతిఎవబతినిటతిజీ.ఇనిఎ) వివిధ రకాల బహుమతి అవసరాలను తీరుస్తున్నాయి. సేంద్రీయ హల్ది, ఆమ్ల పొడి, అడవి తేనె, నల్ల మిరియాలు, రాగి, త్రిఫల, మరియు కాయధాన్యాలు పెసర పప్పు, మినపప్పు, వైట్ బీన్స్ మరియు దాలియా వంటి సహజ మరియు రోగనిరోధక శక్తిని పెంచే గిరిజన ఉత్పత్తుల నుండి పెయింటింగ్స్ వంటి కళాఖండాల వరకు వర్లి శైలిలో పటాచిత్రాలు అందుబాటులో ఉన్నాయి. అలాగే డోక్రా శైలిలో చేతితో తయారు చేసిన ఆభరణాల నుండి ఉత్తరాన వాంచో మరియు కొన్యాక్ తెగల తయారు చేసిన పూసల హారాలు ఉన్నాయి.

తూర్పు ప్రాంతం నుండి గొప్ప మరియు అందమైన వస్త్రాలు మరియు పట్టువస్త్రాలు; రంగురంగుల తోలుబొమ్మలు మరియు పిల్లల బొమ్మలు, డోంగ్రియా షాల్స్ మరియు బోడో వీవ్స్ వంటి సాంప్రదాయ నేత వరకూ; మెటల్ క్రాఫ్ట్ నుండి వెదురు ఉత్పత్తుల వరకు ఏదైనా మరియు ప్రతి రకమైన బహుమతి వస్తువు ఇక్కడ అందుబాటులో ఉంది. అవసరాలు మరియు బడ్జెట్‌ను బట్టి వాటిని ఆకర్షణీయమైన మరియు అనుకూలీకరించదగిన బహుమతి ప్యాక్‌ల్లో అందించబడతాయి. ఈ బహుమతి హాంపర్లు ప్రీమియం సేంద్రీయ, పునర్వినియోగపరచదగిన, స్థిరమైన ప్యాకింగ్ మెటీరియల్‌లో ప్యాక్ చేయబడతాయి. వీటిని ప్రఖ్యాత డిజైనర్ శ్రీమతి రినా ధాకా ప్రత్యేకంగా ట్రైబ్స్ ఇండియా కోసం రూపొందించారు. ఇవి ఏ సందర్భానికైనా అనుకూలంగా ఉండే బహుమతుల కోసం తయారు చేయబడ్డాయి.

ప్రేమ మరియు రక్షణకు సంబంధించిన ఈ పండుగకు మీరు సిద్ధమవుతున్నప్పుడు మీ సమీప ట్రైబ్స్ ఇండియా అవుట్‌లెట్ లేదా వెబ్‌సైట్‌ను దర్శించండి. అలాగే బహుమతులకు అవసరమైన వస్తువులను తిలకించండి.

# ఎంపీ సంతోష్‌కు స్వాగతం.. రెండు వేల మంది మహిళలతో దండాలు

హైదరాబాద్ , జులై 13:టీఆర్ఎస్ ఎంపీ సంతోష్ కుమార్‌కు స్వాగతం చెప్పేందుకు నేతలు, అధికారులు రోడ్ల వెంబడి మహిళలను నిలబెట్టించి దండాలు పెట్టించారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లాలో గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎంపీకి స్వాగతం చెప్పేందుకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్.. 2 వేల మంది మహిళలను కిలోమీటర్ పొడవునా చేతిలో మొక్కలతో నిలబెట్టించి దండాలు పెట్టించారు. తర్వాత కేసీఆర్ ఎకో పార్క్‌లో ఎంపీ, మంత్రి మొక్కలు నాటారు.



ఈ నెల 10న మంత్రి కేటీఆర్ నారాయణపేట జిల్లా పర్యటనకు వెళ్లినప్పుడూ ఇలాంటి సంఘటనే జరిగింది. నారాయణపేట జిల్లా కేంద్రంలో పట్టణ ప్రగతి కార్యక్రమంలో పాల్గొనడానికి కేటీఆర్ వెళ్లగా.. నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, అక్కడి జిల్లా అధికారులు రోడ్ల వెంబడి అంగన్‌వాడీ మహిళలు, స్వయం సహాయక సంఘాల గ్రూపుల మహిళలతో దండాలు పెట్టించారు. ఈ రెండు కార్యక్రమాల్లోనూ నేతల రాక కోసం మహిళలు గంటల తరబడి వేచి ఉన్నారు. కొంత మంది వృద్ధులు నిలబడలేక కింద కూర్చుండిపోయారు. ఈ సంఘటనలపై తీవ్ర విమర్శలొచ్చాయి. మహిళా సంఘాల సభ్యులను తీసుకొచ్చి టీఆర్ఎస్ నేతల మెప్పు కోసం అధికారులు ప్రయత్నిస్తున్నారని బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. మరోవైపు ఈ వ్యవహారం సోషల్ మీడియాలోనూ వైరల్ అవుతోంది. దొరల పాలన అంటే ఇదే అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.




# ఆగస్టు 1న పాతబస్తీ బోనాలు

**-అధికారులతో సమీక్షా సమావేశంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**

హైదరాబాద్ , జులై 13:ఆగస్టు 1న నిర్వహించనున్న పాతబస్తీ బోనాల ఉత్సవాల ఏర్పాట్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.7 కోట్లు వెచ్చిస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం సాలార్జంగ్ మ్యూజియంలో మంత్రి శ్రీనివాస్ యాదవ్ పాతబస్తీ బోనాల నిర్వహణ, ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులు, ఉత్సవాల నిర్వాహకులు, ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ అభివృద్ధి పనులు, భక్తులకు కనీస వసతులు తదితర 132 పనుల కోసం రూ.7 కోట్లు వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు.

అమ్మవార్లకు ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించడం జరుగుతుందన్నారు. ఉత్సవాలకు ప్రభుత్వం రూ.90 కోట్లను ఖర్చు చేస్తుండగా.., ఇందులో రూ.15 కోట్లు వివిధ ఆలయాలకు ఆర్థిక సహాయం కింద, మరో రూ.75 కోట్లు బోనాల ఉత్సవాల ఏర్పాట్ల కోసం ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ శంకర్ యాదవ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జోనల్ కమిషనర్ సామ్రాట్ అశోక్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ హరికృష్ణ, వాటర్ వర్క్స్ డైరెక్టర్ కృష్ణ, సీజీఎం వినోద్ భార్గవ, ట్రాన్స్ కో సీజీఎం స్వామి, డీసీపీ గజారావు, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాములు నాయక్, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణ, ఐ అండ్ పీఆర్, సీఐఈ రాధాకృష్ణ, వైద్య, ఆరోగ్య శాఖ ఎస్‌పీహెచ్‌ఓ లక్ష్మణ్, పర్యాటక శాఖ ఎస్ఈ అశోక్, వివిధ ఆలయాల కమిటీ సభ్యులు, ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# నిరుద్యోగులకు అండగా వైఎస్ఆర్టీపీ.. ఉద్యోగాలు భర్తీ చేసే వరకు పోరు



హైదరాబాద్ , జులై 13:నిరుద్యోగులు ఎంత మంది ఆత్మహత్యలు చేసుకున్నా కేసీఆర్ ప్రభుత్వం పట్టనట్టుగా వ్యవహరిస్తోందని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. నిరుద్యోగులకు మద్దతుగా వనపర్తి జిల్లా తాడిపర్తిలో వైఎస్ షర్మిల నిరాహార దీక్ష చేపట్టారు. ప్రభుత్వ శాఖల్లో లక్షా 90 వేల వరకు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. 50 వేల ఉద్యోగాలు చేపడతామని ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటివరకు నోటిఫికేషన్ విడుదల చేయలేదని మండిపడ్డారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేసే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. నిరుద్యోగులకు అండగా నిలబడతానని చెప్పారు. తాడిపర్తిలో రోజంతా నిరాహార దీక్ష చేయనున్నట్లు షర్మిల వెల్లడించారు. నిరుద్యోగుల ఆత్మహత్యలు ఆపేందుకు వారికి భరోసా కల్పించేందుకు ప్రతి మంగళవారాన్ని నిరుద్యోగ వారంగా వైఎస్సార్?టీపీ ప్రకటిస్తుందని చెప్పారు. నిరుద్యోగులకు అండగా తాము నిరాహార దీక్ష చేస్తున్నామన్నారు. ఎవరు చచ్చినా.. నాకేంటి అన్నట్లు కేసీఆర్ వ్యవహరిస్తున్నారని షర్మిల మండిపడ్డారు.

# తాలిపేరు ప్రాజెక్టు నాలుగు గేట్లు ఎత్తివేత

హైదరాబాద్ , జులై 13:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఆ జలాశయం నిండు కుండలా తయారైంది. ప్రాజెక్టు సామర్థ్యం 74 మీటర్లు కాగా ప్రస్తుతం 73.14 మీటర్ల మేర నీటిని నిల్వ చేస్తున్నారు. ఈ క్రమంలో అధికారులు నాలుగు గేట్లు ఎత్తి 2,695 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

మరోవైపు పాల్వంచ పరిధిలోని కిన్నెరసాని రిజర్వాయర్‌కు కూడా వరద నీరు కొనసాగుతోంది. ఈ రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 407 ఫీట్లు కాగా ప్రస్తుత నీటి మట్టం 400 అడుగులకు చేరింది. కాగా జిల్లాలోని ప్రాజెక్టులకు వరద నీరు వచ్చి చేరుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# ఓయూ పరిధిలోని అన్ని పీజీ కోర్సుల పరీక్ష తేదీల్లో మార్పులు..

హైదరాబాద్ , జులై 13:ఓయూ పరిధిలోని అన్ని పీజీ కోర్సుల పరీక్ష తేదీల్లో మార్పులు చేసినట్టు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ తెలిపారు. ఎంఏ, ఎంకామ్, ఎంకామ్ (ఐఎస్), ఎమ్మెస్సీ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 14 నుంచి నిర్వహిస్తామని పేర్కొన్నారు.డిగ్రీ పరీక్ష ఫీజు గడువు పెంపుఓయూ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ గడువును పొడగించారు. ఆరో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును రూ.300 అపరాధ రుసుముతో ఈ నెల 14వ తేదీ వరకు సంబంధిత కళాశాలల్లో చెల్లించేందుకు అవకాశం కల్పించారు.బీఎస్సీ (ఆనర్స్) ఫారెస్ట్రీ పరీక్ష ఫీజు గడువు 19బీఎస్సీ (ఆనర్స్) ఫారెస్ట్రీ కోర్సు మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈ నెల 19 వరకు స్వీకరిస్తారు.

# కేరళలో మరో ఇద్దరికి జికా వైరస్.. 21కి పెరిగిన కేసుల సంఖ్య..!

తిరువనంతపురం, జులై 13:: కేరళలో జికా వైరస్ చాప కింద నీరులా విస్తరిస్తూనే ఉంది. ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఒకటి రెండు కేసులు నమోదవుతూనే ఉన్నాయి. తాజాగా ఇవాళ కూడా ఇద్దరిలో జికా వైరస్ బయటపడింది. దాంతో ఆ రాష్ట్రంలో మొత్తం జికా వైరస్ కేసుల సంఖ్య 21కి పెరిగింది. మంగళవారం పూంతూర గ్రామానికి చెందిన ఓ 35 ఏండ్ల వ్యక్తిలో, శాస్తమంగళం గ్రామానికి చెందిన 41 ఏండ్ల వ్యక్తిలో జికా వైరస్ ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. ఈ వివరాలను కేరళ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జి మీడియాకు వెల్లడించారు.

# కృష్ణా జిల్లా ఎస్పీగా సిద్ధార్థ



అమరావతి, జులై 13:కృష్ణా జిల్లా ఎస్పీగా సిద్ధార్థ కౌశల్ బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీలలో భాగంగా కృష్ణా జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్ బాబు తూర్పు గోదావరి జిల్లా ఎస్పీగా బదిలీ కావడంతో ఆ స్థానంలో సిద్ధార్థ కౌశల్ కృష్ణా జిల్లా ఎస్పీగా వచ్చారు. 2012 ఐపీఎస్ బ్యాచ్ కు చెందిన ఆయన తొలుత గ్రేహౌండ్స్ లో విధులు నిర్వర్తించి అనంతరం పార్వతీపురం, విశాఖపట్నం ఏఎస్పీగా, ప్రకాశం జిల్లా ఎస్పీగా బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ లక్ష్యంగా విధులు నిర్వహిస్తామని, సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కార్యాచరణ రూపొందిస్తూ నూతన ప్రణాళికలు చేపడతామన్నారు. మహిళల భద్రతకు పెద్దపీట వేస్తూ మహిళా సంక్షేమానికి వినూత్న కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, నిలువరిస్తూ నేర రహిత జిల్లాగా కృష్ణా జిల్లా మార్చడంలో తనదైన పాత్ర పోషిస్తానని ఎస్పీ చెప్పారు.

# జే అండ్ జే టీకాతో.. అరుదైన జీబీఎస్ నరాల వ్యాధి

వాషింగ్టన్, జులై 13:: అమెరికాకు చెందిన ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (ఎఫ్‌డీఏ) కొత్త వార్నింగ్ ఇచ్చింది. జాన్సన్ అండ్ జాన్సన్ టీకా తీసుకున్నవారిలో అరుదైన నాడీ సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నట్లు చెప్పింది. గుయిల్లెయిన్ బారీ సిండ్రోమ్(జీబీఎస్) సమస్యలు ఉత్పన్నం అయ్యే ఛాన్సు ఉన్నట్లు ఎఫ్‌డీఏ పేర్కొన్నది. ఫిబ్రవరిలో జాన్సన్ అండ్ జాన్సన్ టీకాకు ఎమర్జెన్సీ అనుమతి దక్కిన విషయం తెలిసిందే. నిజానికి అమెరికాలో ఈ టీకాను పెద్దగా వాడలేదు. కానీ జీబీఎస్ లక్షణాలు ఉన్న వంద కేసులను గుర్తించినట్లు చెప్పారు. సుమారు కోటి 20 లక్షల మందికి జాన్సన్ అండ్ జాన్సన్ టీకాలను వేశారు. తాజా అధ్యయనం ప్రకారం 95 మంది తీవ్రమైన జీబీఎస్ లక్షణాలతో ఆస్పత్రి పాలయ్యారు. దాంట్లో ఒకరు మరణించినట్లుత ఎలుస్తోంది. జీబీఎస్ ద్వారా.. శరీరంలోని రోగ నిరోధక శక్తి దెబ్బతింటుంది. నాడీ కణాలు కుప్పకూలిపోతాయి. దీంతో కండరాల బలహీనమవుతాయి. సీరియస్ కేసుల్లో పక్షవాతం వచ్చే అవకాశాలు ఉన్నాయి. టీకా తీసుకున్న 42 రోజుల తర్వాత లక్షణాలు కనిపిస్తాయని, కానీ ఈ కేసులు అత్యంత అరుదు అని సర్వే నివేదికలో తెలిపారు.

# రఘురామకు త్వరలోనే నోటీసులు అందుతాయి: ఎంపీ మార్గాని భరత్

అమరావతి, జులై 13:వైసీపీ రెబల్ ఎంపీ రఘురామకృష్ణరాజుపై త్వరలోనే అనర్హత వేటు నోటీసులు వస్తాయని ఎంపీ మార్గాని భరత్ అన్నారు. ఇప్పటికే రఘురామపై లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాకు ఫిర్యాదు చేసిన వైసీపీ ఎంపీలు, తాజాగా 290 పేజీల సమాచారాన్ని ఆయనకు అందజేశారు. దీనిపై వైసీపీ ఎంపీ మార్గాని భరత్ వివరించారు. రఘురామకృష్ణరాజు వ్యవహారాన్ని స్పీకర్ కు నివేదించామని, త్వరలోనే రఘురామకు నోటీసులు వస్తాయని వెల్లడించారు. స్పీకర్ తగు నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నామని, స్పీకర్ విచక్షణాధికారాల మేరకు వ్యవహరించి రఘురామపై అనర్హత వేటు వేస్తారని భరత్ వెల్లడించారు. రఘురామ వైఖరి పార్టీ అధినేతకు, పార్టీ సిద్ధాంతాలకు పూర్తి విరుద్ధంగా ఉందని అన్నారు.

# మైనార్టీల అభివృద్ధికి కృషి : ప్రభుత్వ విప్ సునీతామహేందర్‌రెడ్డి



యాదాద్రి భువనగిరి, జులై 13: : రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల అభ్యున్నతికి కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి అన్నారు. ఆలేరు పట్టణంలోని మిస్పా చర్చి కంపౌడ్, మరమత్తుల కోసం ప్రభుత్వం రూ. 5లక్షలను మంజూరు చేసింది. మంజూరుకు సంబంధించి ప్రొసిడింగ్ పత్రాలను చర్చి ఫాథర్ డేవిడ్‌కు మంగళశారం ఎమ్మెల్యే అందజేశారు. మైనార్టీల సంక్షేమం ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కన్నెబోయిన ద్యాని, రాములు, మల్లయ్య, యాదగిరి, పోచయ్య, నర్సయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

# భారతదేశ పూర్వ క్రికెటర్ యశ్ పాల్ శర్మ గారి కన్నుమూత పట్ల సంతాపం తెలిపిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జులై 13:భారతదేశం లో క్రికెట్ పూర్వ క్రీడాకారుడు, 1983 ప్రపంచ కప్ ను గెలుచుకొన్న జట్టు లో సభ్యుడు శ్రీ యశ్ పాల్ శర్మ గారి కన్నుమూత పట్ల ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

“ శ్రీ యశ్ పాల్ శర్మ గారు భారతదేశం క్రికెట్ జట్టు లోను, 1983 లో చరిత్ర సృష్టించిన క్రికెట్ జట్టు లోను అతి ప్రియతమ సభ్యుడు. జట్టు లోని సాటి క్రీడాకారుల కు, అభిమానుల కు, వర్ధమాన క్రికెటర్ లకు ఆయన ప్రేరణ గా నిలచారు. ఆయన మరణం దుఃఖాన్ని కలిగించింది. ఆయన కుటుంబాని కి, ఆయన అభిమానుల కు ఇదే నా సంతాపం. ఓమ్ శాంతి ” అని ప్రధాన మంత్రి ఒక ట్వీట్ లో పేర్కొన్నారు.

# పిల్లి కోసం తల్లి తపన ఆచూకీ చెప్పినవారికి 30 వేల బహుమతి

అమరావతి, జులై 13:మనుష్యులు తప్పిపోతే పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ ఇవ్వటం చూశాం..పెంచుకున్న కుక్కలు మాయమయ్యాని కేసులను చూశాం, కాని ఇంట్లో పెంచుకునే పిల్లి మాయమైందని ఓ విచిత్రమైన కేసు టోలిచౌకిలో నమోదైంది. దీంతో ఆశ్చర్యపోవడం పోలీసుల వంతైంది. తాము గారభంగా పెంచుకున్న పిల్లి తప్పిపోయిందంటూ ఓ జంతు ప్రేమికురాలు పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో, తను పెంచుకున్న పిల్లి ఆచూకీ కోసం ఏకంగా 30 వేల రివార్డు ప్రకటించింది.

టోలిచౌకి ప్రాంతానికి చెందిన సెరీనా స్వతహాగా జంతు పేమికురాలు. చిన్నతనం నుండి ఇంట్లో పలు రకాల జంతువులను పెంచుతుంది. గత ఎనిమిది నెలల క్రితం అప్పుడే పుట్టిన జింజర్ అనే పిల్లిని అడప్ట్ చేసుకుంది. అప్పటి నుండి జింజర్ ను ప్రేమగా పెంచుకుంది. కరోనా నేపథ్యంలో పిల్లికి ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించేందుకు జూబ్లీహిల్స్ లోని (ట్రస్టీ ) పెట్ క్లినిక్ కు జూన్ 17 న సర్జరీ చేయించింది. స్టిచెస్ వేసిన చోట స్వెల్లింగ్ రావడంతో తిరిగి జూన్ 23న అదే




హాస్పిటల్ కు తీసుకెళ్లింది. ట్రీట్మెంట్ జరుగుతుండగా జూన్ 24న హాస్పిటల్ నుండి పిల్లి తప్పిపోయిందంటూ హాస్పిటల్ సిబ్బంది ఆమెకు సమాచారం ఇచ్చారు. దీనితో హాస్పిటల్ వాళ్ళను నిలదీయడంతో వారి నుండి నిర్లక్ష్యంగా సమాధానం వచ్చిందని తెలిపారు.

తన పెంపుడు పిల్లి కనిపించడం లేదంటూ జూన్ 27న రాయదుర్గం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో , తానే స్వయంగా జూబ్లీహిల్స్ పరిసర ప్రాంతాల్లో పంప్లెంట్స్ పంచుతూ తిరిగిన ఉపయోగం లేదంటూ కన్నీరు పెట్టుకుంది. దీనితో హైదర్ గూడ లో ఏర్పాటు చేసిన సమావేశంలో తన బాధను మీడియా తో పంచుకుంది. తన పిల్లి ఆచూకీ కోసం గత 20 రోజులుగా వెతుకుతున్న లాభం లేకపోవడంతో ? పిల్లి ఆచూకీ తెలిపిన వారికి ముప్పై వేల రివార్డును ప్రకటించింది.

# రేవంత్ మాస్టర్ స్కెచ్.. వలసలు షురూ

హైదరాబాద్ , జులై 13:తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రేవంత్ రెడ్డి పార్టీ బలోపేతంపై దృష్టి సారించారు. పీసీసీ చీఫ్ గా నియామితులైన తర్వాత పార్టీ సీనియర్ల లీడర్ల మద్దతు కూడగట్టిన రేవంత్.. ఇప్పుడు పార్టీకి చెందిన మాజీ నేతలపై ఫోకస్ పెట్టారు. కాంగ్రెస్ పార్టీని వీడిన నాయకులు మళ్లీ తిరిగి సొంత గూటికి రావాలని ఇప్పటికే రేవంత్ పిలుపునిచ్చారు. అందులో భాగంగా కాంగ్రెస్ ను వీడిన మాజీ నేతలతో సమావేశం అవుతున్నారు. పలు జిల్లాల టీఆర్ఎస్ నేతలతో భేటీలు అయ్యారు. కాంగ్రెస్‌లో చేరికపై వారు సంకేతాలు పంపించారు. భూపాలపల్లి నేత గండ్ర సత్యనారాయణ, సీనియర్ నేత డీఎస్ కుమారుడు, నిజామాబాద్ మాజీ మేయర్ సంజయ్, మహబూబ్‌నగర్ జిల్లా నేత ఎర్ర శేఖర్ తదితరులతో సమావేశం అయ్యారు. వారు త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నారు.

టీపీసీసీ చీఫ్‌గా రేవంత్ రెడ్డిని బలప ర్చడానికే తిరిగి కాంగ్రెస్‌లోకి వస్తున్నానని నిజామాబాద్ మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ అన్నారు. మంచి రోజు చూసుకొని పార్టీలో చేరతానన్నారు. తన తండ్రి డీఎస్ కోసం టీఆర్ఎస్ కండువా కప్పుకున్నానని, కానీ అది కండువా కాదు.. గొడ్డలి అని తనకు తెలుసని వ్యాఖ్యాని ంచారు. కాంగ్రెస్



తో పోలిస్తే.. టీఆర్ఎస్ పార్టీయే కాదన్నారు. కడుపులో కోపం ఉన్నా.. ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. తన తమ్ముడు ఏ పార్టీలో ఉంటే.. తనకేంటి అని ప్రశ్నించారు.రేవంత్ పీసీసీ అధ్యక్షుడు అయ్యాక తన మార్క్ వ్యూహాలతో దూసుకు పోతున్నారు. రాష్ట్రంలో తిరిగి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా సాగుతున్నారు. అందుకు తనతో కలిసి వచ్చే నాయకులను కలుపుకుపో తున్నారు. గతంలో కాంగ్రెస్, బీజేపీల నుంచి టీఆర్ ఎస్ లోకి వలసలు కొనసాగగా.. ఇప్పుడు సీన్ రివర్స్ అయిందనే టాక్ వినిపిస్తోంది. రానున్న రోజుల్లో టీఆర్ఎస్ పార్టీలో మరన్ని వలసలు ఉంటాయని స్పష్టం చేస్తున్నారు.

# మెరిట్ ప్రాతిపదికన ఇంటర్ కాలేజీల్లో సీటు..

అమరావతి, జులై 13:ఇంటర్ ఇంటర్ ఫస్ట్ ఇయర్ అడ్మిషన్లకు సంబంధించి ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2021-22 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశాలను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించ ేందుకు ఇంటర్ బోర్డు సన్నాహాలు పూర్తి చేసింది. పారదర్శకతతో.. మెరిట్ ప్రాతిపదికన విద్యార్థులు కోరుకున్న కళాశాలలో, గ్రూపులో సీటు పొందేలా ఏర్పాట్లను చేస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ కాలేజీల్లో ఫస్టియర్‌లో ఆన్‌లైన్ ప్రవేశాలకు ఇంటర్ బోర్డు గత విద్యా సంవత్సరంలోనే శ్రీకారం చుట్టింది. ఆన్‌లైన్ ప్రవేశాలకు వీలుగా గతేడాది ఇంటర్ బోర్డు అనేక సంస్కరణలు చేపట్టింది. కొత్త కాలేజీల అనుమతులు, రెన్యువల్‌కు ఆన్‌లైన్ దరఖాస్తు విధానం ప్రవేశపెట్టింది. కాలేజీల వారీగా వెబ్‌సైట్‌లో ఫొటోలన్నింటినీ విద్యార్థులు, తల్లిదండ్రులు చూసేలా అందుబాటులో ఉంచింది. ఇక ఆయా కాలేజీలో ఏయే గ్రూపులున్నాయి? ఎంతమంది సిబ్బంది ఉన్నారు? వంటి వివరాలను కూడా పొందుపరిచింది. వీటి ఆధారంగా విద్యార్థులు తమకు నచ్చిన కాలేజీలో దరఖాస్తుకు అవకాశం కల్పించింది. గతంలో కాలేజీల్లో సెక్షన్‌కు 80 మంది వరకు అనుమతించేవారు. కానీ సీబీఎస్ఈ విధానంలో సెక్షన్‌కు 40 మందిని మాత్రమే ఇంటర్ బోర్డు పరిమితం చేసింది. గరిష్టంగా 9 సెక్షన్ల వరకు మాత్రమే అనుమతిచ్చేలా నిబంధన పెట్టింది. అలాగే ఎంపీసీ, బైపీసీతోపాటు హెచ్ఈసీ, సీఈసీ, ఎంఈసీ వంటి గ్రూపులను కూడా ప్రవేశపెట్టాల్సిందేనని సర్కార్ స్పష్టం చేసింది. కాలేజీల వారీగా కోర్సులు, సీట్ల సమాచారాన్ని కంప్యూటరీకరించి ఆన్‌లైన్ అడ్మిషన్లకు అనుగుణంగా వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. ఆన్‌లైన్ అడ్మిషన్ల కోసం ప్రత్యేక పోర్టల్‌ను కూడా రూపొందించింది. ఆన్‌లైన్ అడ్మిషన్లతో ప్రైవేటు కాలేజీల్లో కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, మహిళలు, క్రీడాకారులకు సంబంధించిన కోటా సీట్లు వారితోనే భర్తీ కానున్నాయి. దీంతో ప్రైవేటు కళాశాలల అక్రమాలకు ముకుతాడు పడనుంది.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఎలా అంటే.. ఆన్‌లైన్ అడ్మిషన్ల విధానంలో ఇంటర్ బోర్డు విద్యార్థులకు అనేక వెసులుబాట్లు కల్పించింది. గతంలో మాదిరిగా కాలేజీల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వెబ్‌సైట్‌లో పదో తరగతి హాల్‌టికెట్ నంబర్, పాసైన సంవత్సరం, బోర్డు, తల్లిదండ్రుల పేర్లు, మొబైల్ నంబర్, ఈమెయిల్ ఐడీ, పుట్టిన తేదీ, చదివిన స్కూల్, కులం, ఆధార్ నంబర్ల వివరాల ద్వారా ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది.

ఆ రిజిస్ట్రేషన్ ఐడీ పాస్‌వర్డ్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థి పూర్తి చిరునామా, మొబైల్ నంబర్ నమోదు చేశాక జిల్లాలు, కాలేజీలు, మాధ్యమాల వారీగా గ్రూపులతో వివరాలు కనిపిస్తాయి. మకు నచ్చిన గ్రూపు, కాలేజీకి ప్రాధాన్య క్రమంలో విద్యార్థి ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. తరువాత విద్యార్థి రిజర్వేషన్, పదో తరగతిలో ప్రతిభ ఆధారంగా ఆయా కాలేజీల్లో సీట్లను బోర్డు కేటాయిస్తుంది. విద్యార్థి మొబైల్ నంబర్‌కు మెసేజ్ రూపంలో దాన్ని తెలియచేస్తుంది. అలాట్‌మెంట్ లెటర్‌ను పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని కేటాయించిన కాలేజీలో చేరాలి. పాఠశాల విద్య నియంత్రణ పర్యవేక్షణ కమిషన్ నిర్ణయించిన ఫీజును ఆ కాలేజీకి ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా చెల్లించాలి. అయితే ఫీజులను కమిషన్ ఇంకా నిర్ణయించాల్సి ఉంది. విద్యార్థి ఒరిజినల్ సర్టిఫికెట్లను కాలేజీలో సమర్పించాల్సిన అవసరం లేదు. ఆన్‌లైన్ దరఖాస్తులోనే ఆయా సర్టిఫికెట్ల నంబర్లను నమోదు చేయించి ఇంటర్ బోర్డే వాటిని ఆన్‌లైన్‌లో పరిశీలిస్తుంది. ప్రస్తుతం 2020-21కి విద్యార్థులకు ఫలితాలను ప్రకటించే ప్రక్రియలో ఇంటర్ బోర్డు నిమగ్నమై ఉంది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఆన్‌లైన్ అడ్మిషన్లకు శ్రీకారం చుడతామని బోర్డు వర్గాలు వివరించాయి.

# మోదీ, అమిత్ షా నాకు నాయకులు: పంకజ ముండే

ముంబై, జులై 13:: బీజేపీలో తాను జాతీయ స్థాయి నాయకురాలినని, ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా, పార్టీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా తనకు నాయకులని దివంగత గోపినాథ్ ముండే పెద్ద కుమార్తె, బీజేపీ జాతీయ జనరల్ సెక్రెటరీ పంకజ ముండే చెప్పారు. ఇటీవల జరిగిన కేంద్రమంత్రివర్గ విస్తరణలో తనకు మంత్రి పదవి దక్కనందుకు తన అనుచరులు చాలా మంది పార్టీ పదవులకు రాజీనామాలు చేసేందుకు సిద్ధమయ్యారని ఆమె తెలిపారు.

తన తండ్రి గోపినాథ్ ముండే ఎప్పుడైనా సమాజంలో అట్టడుగు వర్గాల వారికే ఉన్నత పదవులు కట్టబెట్టేవారని పంకజ ముండే గుర్తుచేసుకున్నారు. ఆయన తననుగానీ, తన సోదరి ప్రీతమ్ ముండేనుగానీ మంత్రి పదవుల కోసం రాజకీయాల్లోకి తీసుకురాలేదని చెప్పారు. తన తండ్రి మరణానంతరం మహారాష్ట్ర బీజేపీ తనకు మంత్రి పదవి ఆఫర్ చేసిందని, కానీ తాను తిరస్కరించానని పంకజ ముండే తెలిపారు.

తన సోదరి ప్రీతమ్ ముండేకుగానీ, తనకుగానీ మంత్రి పదవుల మీద మోజు లేదని ఆమ పంకజ ముండే చెప్పారు. తన కోసం పదవులకు రాజీనామా చేసేందుకు సిద్ధపడ్డ తన అనుచరులందరినీ వారించానని, తన కోసం ఎవరూ త్యాగాలు చేయాల్సిన అవసరం లేదని చెప్పానని ఆమె వెల్లడించారు. ఈ విషయంలో తానేమీ ధర్మ యుద్ధం చేయాలనుకోవడం లేదని, మాజీ సామాజిక వర్గం ఒకరికి మంత్రివర్గంలో చోటుదక్కిందని, అంతే చాలని ఆమె వ్యాఖ్యానించారు.

# మతిభ్రమించి మాట్లాడుతున్నకౌశిక్ రెడ్డి - కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, జులై 13: (నేటినిజం ప్రతినిధి): ఇన్ని రోజులు పార్టీలో ఉండి నీతిమాలిన రాజకీయాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ బహిష్కృత నేత కౌశిక్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ టి పిసిసి కార్యదర్శి ఆది శ్రీనివాస్ అన్నారు .

కౌశిక్ రెడ్డి తన స్థాయిని మర్చిపోయి టి.ఆర్.ఎస్ నాయకులను ప్రసన్నం చేసుకోవడానికి పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి ని రాష్ట్ర పార్టీ ఇన్చార్జ్ మాణిక్ ఠాగూర్ను పార్లమెంట్ ఇన్చార్జి పొన్నం ప్రభాకర్ను విమర్శిస్తున్నాడు తప్ప మరొకటి కాదు ఆయన అన్నారు

టిఆర్ఎస్ వాళ్లు చెప్పినట్టు వాళ్ళు ఇచ్చే స్క్రిప్ట్ విలేకర్ల ముందు చదువుతున్నాడని ఎద్దేవా చేశారు. టిఆర్ఎస్ నాయకులు ఈ రాజకీయాలను ప్రజలు విశ్వసించరు హుజురాబాద్ లో పొన్నం ప్రభాకర్ గౌడ్ పోటీ చేస్తారన్న ప్రచారం చేయడం అతని అవివేకానికి నిదర్శనం పొన్నం ప్రభాకర్ పలుమార్లు పోటీ చేయనని చెప్పినప్పటికీ ఆయనను విమర్శించడానికి తప్పు తప్పుబడుతున్నామని అన్నారు . పొన్నం ప్రభాకర్ అండతోనే ముందుకు వెళ్లి మళ్లీ ఆయనే విమర్శించడనీ తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు పిసిసి అధ్యక్షుడిగా




రేవంత్ రెడ్డి బాధ్యతలు తీసుకుని ఐదు రోజులు అవుతుంది ఇక హుజురాబాద్ పై దృష్టి పెట్టి ఎన్నికల్లో గెలవడానికి సమావేశాలు ఏర్పాటు చేస్తారని ముందే తెలుసుకొని ముందు జాగ్రత్తగా అధికార పార్టీ వైపు ప తన స్వార్థం కోసమే అడుగులు వేస్తూ రేవంత్ రెడ్డిని పొన్నం ప్రభాకర్ ను మాణిక్య విమర్శించడాన్ని తప్పుబడుతున్నారు వెంటనే వారికి క్షమాపణ చెప్పాలని అన్నారు ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి,జిల్లా అధికార ప్రాధినిది నాగుల విష్ణు ప్రసాద్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ చిలివేరి శ్రీనివాస్, నాయకులు లింగంపల్లి కిరణ్, కనికరపు రాకేష్, నాగుల రాము గౌడ్, కోలకాని రాజు, వస్తాది కృష్ణ, నాగుల మహేష్ గౌడ్, తోట రాజేష్, మేండే రాజు, సాబీర్ తదితరులు ఉన్నారు

# స్థిరంగా పెట్రో ధరలు.. హైదరాబాద్ లో లీటర్ పెట్రోల్ ఎంతంటే..

న్యూఢిల్లీ, జులై 13:చమరు ధరలు భగభగ మండిపోతున్నాయి. పెట్రోల్, డీజిల్ ధరలు మంగళవారం స్థిరంగా ఉన్నాయి. దేశీయ చమురు మార్కెటింగ్ కంపెనీలు నేడు ధరలను యథాతథంగా ఉంచాయి. దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.101.19, లీటర్ డీజిల్ ధర రూ.89.72గా ఉంది. నిన్న పెట్రోల్ ధర పెరగగా, డీజిల్ ధర తగ్గిన విషయం తెలిసిందే. దేశ ఆర్థిక రాజధాని ముంబై నగరంలో పెట్రోల్ ధర రూ.107 దాటింది. డీజిల్ 27 పైసలు తగ్గి రూ.97.29 వద్ద ఉంది. చెన్నైలో లీటర్ పెట్రోల్ రూ.101.92, లీటర్ డీజిల్ రూ.94.24,హైదరాబాద్‌లో లీటరు పెట్రోల్ ధర రూ.105.15 వద్ద ఉంది. ఇక డీజిల్ ధర రూ.97.78 వద్ద కొనసాగుతోంది. కాగా, పెట్రోల్ ధర మే నుంచి ఇప్పటి వరకు లీటరుకు ఏకంగా రూ.10.79 పెరిగింది. అదేసమయంలో డీజిల్ ధర లీటరుకు రూ.8.99 పైకి కదిలింది. ఇంధన ధరలు ఏకంగా 39 సార్లు పెరిగాయి.

# భారత్‌లో తొలి కరోనా పేషెంట్‌కు మళ్లీ కరోనా పాజిటివ్

న్యూఢిల్లీ, జులై 13:భారత్‌లో తొలి కరోనా పేషెంట్‌గా రికార్డులకెక్కిన కేరళ యువతి మరోసారి కరోనా పాజిటివ్ బారిన పడ్డారు. త్రిస్సూర్ వాసి అయిన ఆమె చైనాలో వైద్య విద్య అభ్యసిస్తూ కరోనా సంక్షోభం కారణంగా గత ఏడాది జనవరిలో స్నేహితులతో పాటు భారత్‌కు తిరిగొచ్చారు. ఈ క్రమంలో ఆమె దేశంలో అడుగు పెట్టాక పాజిటివ్ అని తేలింది. అయితే ఆ యువతి తాజాగా మరోసారి కరోనా బారినపడ్డారు. ఈ విషయాన్ని స్థానిక అధికారులు వెల్లడించారు. ఆమెలో కరోనా లక్షణాలు లేవని కూడా వారు తెలిపారు. ఢిల్లీకి వెళ్లాలనుకుంటున్న సదరు విద్యార్థిని ఇటీవల కరోనా టెస్ట్ చేయించుకోగా పాజిటివ్ అని వచ్చింది. ప్రస్తుతం ఆమె హోం క్వారంటైన్‌లో ఉన్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ఇప్పటికే ఆమె కరోనా టీకా తొలి డోసు కూడా తీసుకుందని పేర్కొన్నారు.

కాగా తొలిసారి కరోనా బారిన పడ్డ సందర్భంలో ఆమె నెల రోజుల పాటు ఆస్పత్రిలో ఐసోలేషన్‌లో గడపాల్సి వచ్చింది. ఆమెతో పాటూ వూహాన్ నుంచి తిరిగొచ్చిన మరో ఇద్దరు స్నేహితులు కూడా కొంతకాలం తరువాత కరోనా కాటుకు గురైయ్యారు. ఇక భారత వైద్య పరిశోధన మండలి(ఐసీఎంఆర్) గతంలో జరిపిన అధ్యయనంలో రీ ఇన్ఫెక్షన్ రేటు (మరోమారు కరోనా బారినపడటం) 4.5 శాతంగా తేలింది. గతేడాది జనవరి నుంచి అక్టోబర్ మధ్య కాలంలో ఐసీఎంఆర్ ఈ అధ్యయనాన్ని నిర్వహించింది.

# డిజిటల్ ఎడ్యుకేషన్ పురోగతిపై ధర్మేంద్ర ప్రధాన్ సమీక్ష..



న్యూఢిల్లీ, జులై 13:కేంద్ర విద్యాశాఖ చేపట్టిన 'డిజిటల్ ఎడ్యుకేషన్' పురోగతిపై ఆ శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సమీక్ష నిర్వహించారు. పీఎం ఈ-విద్య, నేషనల్ డిజిటల్ ఎడ్యుకేషన్ ఆర్కిటెక్చర్ (ఎన్‌డీఈఏఆర్), స్వయం సహా ఇతర కార్యక్రమాలను కూడా సమీక్షించారు.విద్యలో సాంకేతికత ఆవశ్యకతను వివరించిన ప్రధాన్ దూర, సమగ్ర విద్యా లక్ష్యాలను సాధించేందుకు సాంకేతికత ఉపయోగపడుతుందన్నారు.

విద్యారంగంలో శక్తిమంతమైన డిజిటల్ వ్యవస్థ విద్యార్థుల అభ్యాసనఅవకాశాలను విస్తరించడం తోపాటు,ఆవిష్కరణలు,విద్యాలయాల స్థాపనను పెంచుతుందని ఆయన అన్నారు. డిజిటల్ మాధ్యమం దిశగా అడుగేలేయాల్సిన అవసరాన్ని కొవిడ్ సృష్టించిందని ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. దేశంలో విద్యాబోధన ఆగకుండా కేంద్ర విద్యా శాఖ చేపట్టిన డిజిటల్ కార్యక్రమాలు విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయడంతోపాటు, విద్యావ్యవస్థను మరింత ముందుకు తీసికెళతాయని ధర్మేంద్ర ప్రధాన్ భరోసా ఇచ్చారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



హైదరాబాద్ , జులై 13:వికారాబాద్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి ఆరోగ్యాలను కాపాడుకోవాలని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి ద్వారా మన గ్రామాలను పట్టణాలను చాలా వరకు శుభ్రం చేసుకున్నామన్నారు. అదే విధంగా అందరూ తమ పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా చేసుకోవాలని తెలిపారు. ఇంటి పరిసర ప్రాంతాలలో మురుగు నీరు నిలువకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నీరు నిల్వ ఉండటం వల్ల దోమల వృద్ధి ఎక్కువగా ఉంటుందన్నారు. తప్పనిసరిగా ప్రజలందరూ నీటిని వేడి చేసుకొని చల్లారిన తరువాత తాగాలని సూచించారు.

ఈ సీజన్‌లో ప్రజలు నీటిలో తడవకుండా జాగ్రత్త వహించాలని, ఏదైనా అనారోగ్య లక్షణాలు కనబడితే వెంటనే వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ప్రభుత్వం వైద్య పరీక్షల కోసం ప్రజలపై భారం పడకుండా ముందుగానే మన జిల్లా కేంద్రంలో డయాగ్నొస్టిక్ సెంటర్‌ను ప్రారంభించిందని గుర్తు చేశారు. అన్ని రకాల సీజనల్ వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రభుత్వం ఫీవర్ సర్వే రెండో భాగం నిర్వహించి ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తుందని పేర్కొన్నారు.

# కరోనా బాధితురాలుకు ఆక్సిజన్ సిలిండర్ అందజేత




రాజన్న సిరిసిల్ల, జులై 13: (నేటినిజం ప్రతినిధి): వేములవాడలో చిరంజీవి ఉచిత ఆక్సిజన్ సేవలో భాగంగా వేములవాడ న్యూ అర్బన్ కాలనీకి చెందినటువంటి పుష్పాల లత అనే మహిళకు ఆక్సిజన్ అవసరం ఉన్నందున డాక్టర్ల సూచన మేరకు ఆమెకు రెండవసారి ఆక్సిజన్ సిలిండర్ ను చిరంజీవి అభిమానుల ఆధ్వర్యంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నాయకుడు డాక్టర్ కొండ దేవయ్య చేతుల మీదుగా మంగళవారం రోజున అందజేశారు ఈ సందర్భంగా కొండ దేవయ్య మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఏ ఒక్కరు కూడా ప్రాణవాయువు లేకుండా ప్రాణాలు పోకూడదని చిరంజీవి చేస్తున్న ఈ మహాయజ్ఞంలో నాకు కూడా భాగస్వామ్యంకల్పించినందుకు చాలా సంతోషకరమని ఉందని ప్రతి ఒక్కరు ఈ ఉచిత సేవలు వినియోగించుకోవాలని కోరుతూ ఇంత మహాయజ్ఞంలో సేవలందిస్తున్న టువంటి చిరంజీవి అభిమానులు ప్రవీణ్ కుమార్ అరుణ్ తేజ చారి లను అభినందించారు . ఈ కార్యక్రమంలో కూరగాయల కొమురయ్య కూరగాయల మల్లేశం మెగా అభిమానులు విజయ్ యాదవ్ సుంకరి అంజిబాబు తిరుపతి పాల్గొన్నారు.

# టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడులలో రూ. 75,000 విలువగల ప్రభుత్వ నిషేధిత గుట్కా ప్యాకెట్ల పట్టివేత



రాజన్న సిరిసిల్ల, జులై 13: (నేటినిజం ప్రతినిధి): జిల్లా ఎస్.పి ఆదేశాల మేరకు మంగళవారం రోజున టాస్కోఫర్స్ డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో టాస్కోఫర్స్ సిబ్బంది నమ్మదగిన సమాచారం ప్రకారం సిరిసిల్ల పట్టణంలోని భూపతి నగర్ లో గుంటుక రాజు తండ్రి . నారాయణ అనే వ్యక్తి ప్రభుత్వ నిషేధిత గుట్కా అమ్ముతున్నాడనే పక్క సమాచారం తో రైడ్ చేసి రూ. 75,000/- విలువ గల గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందిని. పట్టుబడ్డ గుట్కా ప్యాకెట్ల ను వ్యక్తిని తదుపరి విచారణ నిమిత్తం సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్లో అప్పగించడం జరిగిందిని, అలాగే జిల్లాలో ఎవరైనా ప్రభుత్వ నిషేధిత అంబర్ జర్దా, గుట్కా ప్యాకెట్ల అమ్మితే వారిపైన కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భముగా అన్నారు. జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ నిషేధిత అంబర్ జర్దా, గుట్కా ప్యాకెట్లు అమ్ముతున్నారనే సమాచారం ఉంటే డయల్ 100, కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించే వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా టాస్క్ ఫోర్స్ సిబ్బంది రమేష్,తిరుపతి,అక్షర్ పాల్గొన్నారు..

# చెట్లను పెంచండి భవిష్యత్ తరాలకు ఆక్సిజన్ అందించండి

**-24 వార్డుల్లో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేసిన కౌన్సిలర్ అన్నారం ఉమారాణి శ్రీనివాస్**



రాజన్న సిరిసిల్ల, జులై 13: (నేటినిజం ప్రతినిధి): చెట్లను పెంచండి భవిష్యత్ తరాలకు ఆక్సిజన్ అందించేందుకు ప్రతి ఒక్కరూ ఇంట్లో చెట్లను నాటాలని వేములవాడ మున్సిపల్ 24 వ వార్డు కౌన్సిలర్ అన్నారం ఉమారాణి శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని 24 వ వార్డులో మంగళవారం రోజు న వార్డ్ కౌన్సిలర్ అన్నా రం ఉ మారాణి శ్రీనివాస్ తోపాటు మున్సిపల్ అధికారి నియాజ్ ఇంటింటికి ఆరు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణం కాలుష్యం తగ్గించడం కోసం మనందరం బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలనిపిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు .

# పచ్చని చెట్టు ప్రగతికి మెట్లు

**9,12 వ వార్డుల్లో మొక్కలను పంపించేసిన మున్సిపల్ చైర్పర్సన్ రామతీర్థపు మాధవి రాజు**



రాజన్న సిరిసిల్ల, జులై 13: (నేటినిజం ప్రతినిధి): పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు అని వేములవాడ మున్సిపల్ చైర్పర్సన్ రామతీర్థ పు మాధవి రాజు అన్నారు. మంగళవారం రోజున 9,12 వ వార్డులలో కౌన్సిలర్ రామతీర్థపు కృష్ణవేణి హరీష్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్పర్సన్ రామతీర్థం మాధవి రాజు హరితహారం కార్యక్రమంలో భాగంగా పూల మొక్కలు, పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాధవి రాజు మాట్లాడుతూ పట్టణంలో యజ్ఞంలా హరితహారం కార్యక్రమం కొనసాగుతున్నాయని, ప్రభుత్వం సంకల్పించిన కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని మొక్కలు నాటడం సంతోషాన్నిస్తుందన్నారు. భవిష్యత్ తరాలకు మనం అందించే గొప్ప ఆస్థి పర్యావరణాన్ని కాపాడి, పెంపొందించడమేఅన్నారు. కరోనా వ్యాధి నివారణకు ఆక్సిజన్ అందించే ఆవశ్యకత అందరికీ ఉందని మరోసారి అర్థమైందని, ఆక్సిజన్ అందించే చెట్లను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరూ తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ అధికారులు సిబ్బంది తదితరులుపాల్గొన్నారు.

# రూ.41 వేల కోట్లకు లెక్కలున్నాయి: పయ్యావులకు బుగ్గన కౌంటర్

అమరావతి, జులై 13:ఏపీ ఆర్థిక శాఖలో లెక్కలపై పీఏసీ ఛైర్మన్ పయ్యావుల కేశవ్ చేసిన ఆరోపణలపై మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ కౌంటర్ ఇచ్చారు. పీఏసీ ఛైర్మన్ పయ్యావుల కేశవ్ ఆరోపణలు అర్థరహితమని, రూ.41 వేల కోట్లకు పూర్తి లెక్కలున్నాయని స్పష్టం చేశారు. బిల్లులు లేకుండా డబ్బులు చెల్లించారన్నది అవాస్తవమని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అనవసర అనుమానాలు రేకెత్తిస్తున్నారని మండిప డ్డారు. ఆడిట్ చేసినప్పుడు పలురకాల ప్రశ్నలు వేస్తారని.. ఆడిట్ సంస్థ ప్రశ్నలను ఆధారంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. సందేహాలు ఉంటే మీటింగ్ పెట్టి పరిష్కరించుకోవచ్చని.. లేఖలు రాయటం వల్ల ప్రయోజనం ఏంటో అర్థం కావట్లేదన్నారు. సీఎఫ్ఎంఎస్ వచ్చాక ట్రెజరీ ద్వారా వ్యవస్థ నడవడం లేదన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడే సీఎఫ్ఎంఎస్‌ను ప్రైవేటు వ్యక్తి చేతిలో పెట్టారరని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తీసుకున్న అప్పును రెండు రాష్ట్రాలు కడుతున్నాయని వివరించారు.

# ఏపీలో మళ్ళీ పెరిగిన కరోనా కేసులు..

అమరావతి, జులై 13:ఏపీలో కరోనా కేసులు ఒక్కసారిగా పెరిగాయి. తాజాగా గడిచిన 24 గంటల్లో కొత్తగా 81,763మందికి కరోనా పరీక్షలు చేయగా 2,567 కరోనా పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. అలాగే కరోనా కారణంగా 18మంది మృతి చెందారు. గడిచిన 24 గంటల్లో కొత్తగా మరో 3,034మంది కరోనా నుంచి కొలుకున్నారు.

ఇక తాజా గణాంకాల ప్రకారం మొత్తం కేసుల సంఖ్య 19,26,988కి చేరింది. అలాగే యాక్టివ్ కేసుల సంఖ్య 26,710కి చేరింది. కరోనా నుంచి కొలుకున్నవారి సంఖ్య 18,87,236కి చేరింది. ఇక మొత్తం మరణాల సంఖ్య 13,042కి చేరింది.

# అక్రమంగా నిల్వ చేసిన గుట్కా ప్యాకెట్ల పట్టివేత

యాదాద్రి భువనగిరి, జులై 13: : అక్రమంగా నిల్వ ఉంచిన రూ.6 లక్షలు విలువైన నిషేధిత గుట్కా ప్యాకెట్లను మంగళవారం ఎస్‌వోటీ పోలీస్‌లు పట్టుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పోలీసుల కథనం మేరకు..మండలంలోని ముల్కలపల్లిలోని ఓ ఇంట్లో భారీగా నిషేధిత గుట్కాలు నిల్వ ఉంచారనే సమాచారంతో ఎస్‌వోటీ పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో రూ.6లక్షలు విలువైన వివిధ రకాల నిషేధిత గుట్కాప్యాకెట్లతో పాటు బైకు, ఫోన్ సీజ్ చేయడంతో పాటు సంబంధిత ఇద్దరు వ్యక్తులు చిన్నం శ్రీశైలం, గుండెబొయిన మల్లేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుబాబు తెలిపారు.

# శంషాబాద్ విమానాశ్రయంలో వ్యక్తి అరెస్ట్

హైదరాబాద్ , జులై 13: శంషాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంలో లిబియా నుంచి ప్రయాణికుడిని అధికారులు అరెస్టు చేశారు. భారత్ నిషేధించిన దేశం నుంచి నిబంధనలు ఉల్లంఘించి ఎయిర్‌పో ర్టుకు వచ్చిన ఓ వ్యాపారిని ఇమ్మిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం గుల్బార్గాకు చెందిన సయ్యద్ హాజీ ఇస్మాయిల్ గత 2017లో హైదరాబాద్ నుంచి దుబాయికి వెళ్లి.. అక్కడి నుంచి వ్యాపారం కోసం లిబియాకు వెళ్లాడు.అక్కడే కొంతకాలం వ్యాపారం చేసిన అతను భారత్‌కు రావాలని నిర్ణయించుకున్నాడు. లిబియా నుంచి దుబాయి మీదుగా మంగళవారం హైదరాబాద్‌కు చేరుకున్నాడు. ఈ సందర్భంగా సయ్యద్ హాజీ ఇస్మాయిల్ పాస్‌పోర్టును తనిఖీ చేసిన అధికారులు లిబియా నుంచి వచ్చినట్లు గుర్తించి ఇమ్మిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకొని ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపారు. 2014లో లిబియా రాజధాని ట్రిపోలీ అంతర్జాతీయ విమానాశ్రయం ధ్వంసమైంది. ఈ క్రమంలో భద్రతా పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని భారత పౌరులు ఆ దేశం వెళ్లకుండా ప్రభుత్వం 2015లో ట్రావెల్ అడ్వైజరీ జారీ చేసింది. 2016, మేలో ప్రభుత్వం ఎలాంటి సంబంధాలు లేకుండా పూర్తిగా నిషేధం విధించింది. అప్పటి నుంచి ఆ దేశానికి భారత్ నుంచి వాణిజ్య విమానాలు నడువడం లేదు.

# తిరుమలలో లేటెస్ట్ టెక్నాలజీతో భద్రతా వ్యవస్థ?

తిరుమల, జులై 13: తిరుమలలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అత్యుత్తమ భద్రతా వ్యవస్థను రూపొందించినట్లు తిరుమలతిరుపతి దేవస్థానం ఈవో డా.కె.ఎస్.జవహర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం తిరుమలలోని పిఏసి-4లో గల కామన్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఈవో,అదనపు ఈవో ఏ.వి.ధర్మారెడ్డితో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ తిరుమలలో భద్రతా,నిఘా వ్యవస్థలు చాలా బాగుందన్నారు. కామన్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను శాశ్వత భవనంగా పిఏసి-4లో ఏర్పాటు చేసేందుకు అవసమైన చర్యలు చేపడతామన్నారు.

ఇజ్రాయల్ టెక్నాలజీతో కూడిన భద్రాత వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు గల అవకాశాలను పరిశీలిస్తామని చెప్పారు. తిరుమలను నేర రహిత పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దేందుకు టీటీడీ భద్రాత సిబ్బంది అంకిత భావంతో పనిచేస్తున్నారని అభినందించారు. త్వరలో మరిన్ని సిసి కెమెరాలు ఏర్పాటు చేసి కామన్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయాలన్నారు. తద్వారా మరింత పటిష్ఠమైన భద్రత వ్యవస్థను తిరుమలలో ఏర్పాటు చేయాలని ఆయన సివిఎస్వో ను కోరారు.

REGD. NO 228 OF 2019

## వురిమళ్ళ ఫౌండేషన్ - అక్షరాల తోవ

**జాతీయస్థాయి కథలు, కవితల పోటీ - 2021 ఫలితాలు**

**కీ॥శే॥ వురిమళ్ల శ్రీరాములు స్మారక కథల పోటీ విజేతలు :**

ప్రథమ బహుమతి : (కథ : ఆడబిడ్డ) శివప్రసాద్, హైద్రాబాద్.
ద్వితీయ బహుమతి : (కథ : వలసదు:ఖం) బి. కళాగోపాల్, నిజామాబాద్.
తృతీయ బహుమతి : (కథ : గురుత్వ ఆకర్షణ) అత్తలూరి విజయలక్ష్మి, హైద్రాబాద్.

ప్రోత్సాహక బహుమతులు :
(కథ : మనిషికీ మనిషికీ మధ్య) చొక్కర తాతారావు, విశాఖపట్నం.
(కథ : ఎన్నుగర్ర) సాగర్ల సత్తయ్య, నల్లగొండ.
(కథ : నమ్మకమే నాన్న) ఆర్.సి. కృష్ణస్వామిరాజు, తిరుపతి
(కథ : నపుత్రికస్య-గతిర్నాస్తి) శైలజామిత్ర, హైద్రాబాద్.
(కథ : వార్షికోత్సవం) జి. రంగబాబు, అనకాపల్లి.

**కీ॥శే॥ వురిమళ్ల పద్మజ స్మారక కవితల పోటీ విజేతలు :**

ప్రథమ బహుమతి : (అక్షయపాత్ర ఆగ్రహిస్తే..) వై.హెచ్.కె. మోహన్‌రావు, గుంటూరు.
ద్వితీయ బహుమతి : (నాలుగు రెక్కలపిట్ట) సాంబమూర్తి లండ, శ్రీకాకుళం.
తృతీయ బహుమతి : (వంటరి పిట్టనై) వాడపర్తి వెంకటరమణ, శ్రీకాకుళం.

ప్రోత్సాహక బహుమతులు :
(వెతికిపెట్టండి) పద్మావతి రాంభక్త, విశాఖపట్నం.
(ఇప్పుడు) బి. కళాగోపాల్, నిజామాబాద్
(ఆరోగ్యలక్ష్మి) ఉప్పల పద్మ, మిర్యాలగూడ.

న్యాయ నిర్ణేత :
శ్రీకంఠస్ఫూర్తి గారు, కాకినాడ
ప్రముఖ కథా రచయిత, కవి, కథా విశ్లేషకులు

న్యాయ నిర్ణేత :
శ్రీ దాట్ల దేవదానం రాజు గారు, యానాం
ప్రముఖ కవి, కథకులు, విమర్శకులు

ఈ కథల పోటీకి రెండు తెలుగు రాష్ట్రాల నుండే కాక విదేశాల నుంచి కూడా విశేషమైన స్పందన రావడం చాలా సంతోషంగా వుంది. మొత్తం 210కి పైగా కథలు రావడం.... అందులోంచి అత్యుత్తమైన వాటికి బహుమతులు ప్రకటించడం జరిగింది. విజేతలకు శుభాకాంక్షలు...
న్యాయ నిర్ణేత : శ్రీకంఠస్ఫూర్తి గారికి ప్రత్యేక ధన్యవాదాలు.

ఈ కథల పోటీకి రెండు తెలుగు రాష్ట్రాల నుండే కాక విదేశాల నుంచి కూడా విశేషమైన స్పందన రావడం చాలా సంతోషంగా వుంది. మొత్తం 250కి పైగా కవితలు రావడం.... అందులోంచి అత్యుత్తమైన వాటికి బహుమతులు ప్రకటించడం జరిగింది. విజేతలకు శుభాకాంక్షలు...
న్యాయ నిర్ణేత : శ్రీ దాట్ల దేవదానం రాజు గారికి ప్రత్యేక ధన్యవాదాలు.

ఈ కథలు, కవితల పోటీల్లో పాల్గొని, విజయవంతం చేసిన రచయితలకు, కవులకు హృదయ పూర్వక ధన్యవాదాలు.

కీ॥శే॥ భోగోజు పురుషోత్తం - సముద్రమ్మ గార్ల స్మారక సాహితీ పురస్కారం - 2021 సం॥ గాను ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు డా॥ దిలావర్ ఉమ్మడి ఖమ్మం జిల్లా గారిని ఎంపిక చేయడ జరిగింది.

ఇట్లు :
వురిమళ్ల సునంద, భోగోజు ఉపేందర్‌రావు, వురిమళ్ళ ఫౌండేషన్, ఖమ్మం.
సెల్ : 9441815722, 9494773969

# 'అందరికీ టీకా మందు- అందరికీ ఉచితం' ప్రచార ఉద్యమాని కి ఈశాన్య ప్రాంతం కీలకం: ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జులై 13:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ కోవిడ్-19 స్థితి ని గురించి ఈశాన్య ప్రాంతాల రాష్ట్రాల ముఖ్యమంత్రుల తో ఈ రోజు న సమావేశమయ్యారు. ఈ సమావేశం లో నాగాలాండ్, త్రిపుర, సిక్కిమ్, మేఘాలయ, మిజోరమ్, అరుణాచల్ ప్రదేశ్, మణిపుర్ ముఖ్యమంత్రుల తో పాటు అసమ్ ముఖ్యమంత్రి కూడా పాల్గొన్నారు. కోవిడ్ మహమ్మారి ని సంబాళించడం లో సకాలం లో చర్యలు తీసుకొన్నందుకు గాను ప్రధాన మంత్రి కి ముఖ్యమంత్రులు ధన్యవాదాలు తెలిపారు. ఈశాన్య ప్రాంతాల రాష్ట్రాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించినందుకు గాను ఆయన ను వారు ప్రశంసించారు. ముఖ్యమంత్రుల కు తోడు హోం శాఖ, రక్షణ శాఖ, ఆరోగ్య శాఖ, ఈశాన్య ప్రాంత అభివృద్ధి (డిఒఎన్ఇఆర్) శాఖ మంత్రుల తో పాటు ఇతర మంత్రులు కూడా ఈ సమావేశం లో పాలుపంచుకొన్నారు.

ముఖ్యమంత్రులు వారి వారి రాష్ట్రాల లో ప్రజల కు టీకామందు ను ఇప్పించే కార్యక్రమం తాలూకు పురోగతి ని గురించి, వ్యాక్సీన్ ను మారుమూల ప్రాంతాల కు సైతం తీసుకు పోవడానికి చేపడుతున్న చర్యల ను గురించి వివరించారు. టీకా ఇప్పించుకొనే అంశం లో సంకోచాన్ని గురించి, ఆ సమస్య ను అధిగమించడానికి తీసుకొంటున్న చర్యల ను గురించి కూడా వారు వివరించారు. కోవిడ్ కేసుల ను మరింత ఉత్తమమైన పద్ధతి లో ఎదుర్కోవడానికి అనువైన వైద్య రంగ సంబంధి మౌలిక సదుపాయాల కల్పన ను మెరుగు పరచడం కోసం తీసుకొన్న చర్యల ను, పిఎమ్-కేర్స్ ఫండ్ ద్వారా అందుతున్న తోడ్పాటు ను గురించి తెలియజేశారు. వారి రాష్ట్రాల లో కేసుల సంఖ్య ను, పాజిటివిటీ రేటు ను తగ్గించడం కోసం సకాలం లో చర్యల ను తీసుకొంటాం అంటూ వారు హామీ ని ఇచ్చారు.

రోజువారీ గా మొత్తం కేసు ల సంఖ్య నమోదు లో తగ్గుదల ను గురించి కేంద్ర హోం శాఖ మంత్రి ప్రస్తావించారు. అయితే, ఇది ఏ వ్యక్తి అయినా సడలుబాటు ను కనబరచడానికి గాని, తగిన జాగ్రత చర్యల ను తీసుకోవడాన్ని తగ్గించివేయడానికి గాని దారి తీయకూడదు అంటూ ఆయన హెచ్చరిక చేశారు. దేశం లోని కొన్ని ప్రాంతాల లో పాజిటివిటీ రేటు అధికం గా ఉంటోందని ఆయన అన్నారు. పరీక్ష లు చేయడం, ట్రేసింగ్, ట్రాకింగ్, టీకా మందు ను వేయించడం వంటి అంశాల కు పెద్ద పీట వేయాలి అని ఆయన నొక్కిచెప్పారు. కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి దేశం లో కోవిడ్ కేసు ల సమగ్ర వివరణ ను అందించారు. ఈశాన్య ప్రాంత రాష్ట్రాలు కొన్నిటి లో పాజిటివిటీ రేటు అధికం గా ఉందని ఆయన చర్చించారు. మెడికల్ ఆక్సీజన్ సరఫరా ను పెంచేందుకు చేపట్టిన చర్యల ను గురించి, ప్రజల కు టీకా ఇప్పించే కార్యక్రమం లో ప్రగతి ని గురించి కూడా ఆయన సమగ్రమైన నివేదిక ను సమర్పించారు.

ఈ సందర్భం లో ప్రధాన మంత్రి మాట్లాడుతూ, ఈశాన్య రాష్ట్రాలు దుర్గమ ప్రాంతాలు ఉండేటప్పటికీ పరీక్షల ను నిర్వహించడానికి, చికిత్స ను అందించడానికి, టీకామందు ను ఇప్పించడానికి అవసరమైన మౌలిక సదుపాయాల ను కల్పించడం లోను, మహమ్మారి కి వ్యతిరేకం గా యుద్ధం చేయడం లోను అక్కడి ప్రజలు, ఆరోగ్య శ్రామికులు, ప్రభుత్వాలు కఠోరంగా పాటుపడినందుకు కొనియాడారు.

కొన్ని జిల్లాల లో కేసుల సంఖ్య పెరుగుతూ ఉండటం పై ప్రధాన మంత్రి ఆందోళన వ్యక్తం చేస్తూ, ఈ సంకేతాల ను అందిపుచ్చుకొని క్షేత్ర స్థాయి లో కఠిన చర్యల ను తీసుకోవలసిన అవసరం ఉందన్నారు. పరిస్థితి ని ఎదుర్కోవడం లో సూక్ష్మ కట్టడి విధి విధానాల ను అమలు పరచాలంటూ ఆయన మరో మారు స్పష్టం చేశారు. ఈ విషయం లో గత ఒకటిన్నర సంవత్సరాల కాలం లో సంపాదించుకొన్న అనుభవాన్ని, ఉత్తమమైనటువంటి అభ్యాసాల ను పూర్తి స్థాయి లో వినియోగించుకోవాలి అని సూచించారు.

వైరస్ వేగం గా రూపు ను మార్చుకొంటోందని ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, మ్యుటేశన్ ను ఖచ్చితమైన విధం గా పర్యవేక్షించాలని, వేరియంట్ లు అన్నిటిని గమనిస్తూ ఉండాలని సలహా ఇచ్చారు. మ్యుటేశన్ లను, అవి కలుగజేసే ప్రభావాలను నిపుణులు అధ్యయనం చేస్తున్నారని ఆయన తెలిపారు. అలాటి పరిస్థితి లో, ఆపుదల, చికిత్స లు కీలకం అవుతాయని ప్రధాన మంత్రి చెప్తూ, కోవిడ్ ను దృష్టి లో పెట్టుకొని మానవులు నడుచుకోవలసిన తీరు ముఖ్య పాత్ర ను పోషిస్తుందని నొక్కిచెప్పారు. ఒక మనిషి కి మరొక మనిషి కి మధ్య సురక్షిత దూరాన్ని పాటించడం, మాస్క్ ను ధరించడం, టీకామందు ను వేసుకోవడం.. వీటితో మంచి ప్రయోజనాలు ఉన్నాయని స్పష్టం అయిందని శ్రీ నరేంద్ర మోదీ గుర్తు చేశారు. అదే విధం గా టెస్టింగ్, ట్రాకింగ్, ట్రీట్‌మెంట్ అనేది సత్ఫలితాల ను ఇచ్చేటటువంటి ఒక వ్యూహం గా కూడా నిరూపణ అయింది అని ఆయన అన్నారు.

పర్యటన రంగం పైన, వ్యాపార రంగం పైన మహమ్మారి చూపిన ప్రభావాన్ని గురించి ప్రధాన మంత్రి చెప్తూ, పర్వత ప్రాంత పట్టణాల లో సరైన ముందు జాగ్రత చర్యల ను పాటించకుండానే గుంపులు గుంపులు గా గుమికూడటం తగదు అంటూ తీవ్ర హెచ్చరిక చేశారు. థర్డ్ వేవ్ వచ్చే కంటే ముందే ఆనందం గా గడపాలని ప్రజలు కోరుకొంటున్నారు అనే వాదన ను ఆయన తోసిపుచ్చుతూ, థర్డ్ వేవ్ దానంతట అదే రాదు అనే విషయాన్ని గ్రహించవలసిన అవసరం ఉంది అన్నారు. మన మనస్సు లో రేకెత్తవలసిన ప్రధానమైన ప్రశ్నల్లా థర్డ్ వేవ్ ను ఏ విధం గా అడ్డుకోవాలి అనేదే అని ప్రధాన మంత్రి చెప్పారు. అజాగ్రత గా ఉండకూడదు, గుంపులు గుంపులు గా చేరకూడదు, అలా చేస్తే కేసు లు అమాంతం పెరిగిపోతాయి అని నిపుణులు పదే పదే హెచ్చరికల ను చేస్తున్నారు అని ఆయన అన్నారు. అవసరం లేని చోట్ల కు తండోప తండాలుగా వెళ్ళడం మానుకోవాలి అని ఆయన గట్టి గా చెప్పారు.

కేంద్ర ప్రభుత్వం పూనుకొని నిర్వహిస్తున్న 'అందరికీ టీకా మందు - అందరికీ ఉచితం' ప్రచార ఉద్యమం లో ఈశాన్య ప్రాంతాల కు సైతం సమానమైన ప్రాముఖ్యం ఉందని ప్రధాన మంత్రి అన్నారు. మనం టీకాకరణ ప్రక్రియ ను వేగవంతం గా అమలు జరపవలసిన అవసరం ఉంది అని కూడా ఆయన చెప్పారు. టీకా వేయించుకోవడం, ప్రజల ను జాగృతం చేయడం.. వీటికి సంబంధించి అపోహల ను దూరం చేసే విషయమై ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, దీని కోసం సామాజిక సంస్థ లు, విద్య సంస్థ లు, ప్రముఖుల తో పాటు ధార్మిక సంస్థ ల సహాయాన్ని అభ్యర్థించాలి అని సూచించారు. వైరస్ ఏయే ప్రాంతాల లో వ్యాప్తి చెందుతుందన్నది అంచనా వేసి, ఆయా ప్రాంతాల లో ప్రజల కు టీకా మందు ను ఇప్పించే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి అంటూ ఆయన విజ్ఞప్తి చేశారు.

పరీక్షల ను నిర్వహించడానికి, చికిత్సల ను అందించడానికి ఉద్దేశించిన మౌలిక సదుపాయాల ను మెరుగుపరచడం కోసం ఇటీవల మంత్రివర్గం ఆమోదం తెలిపిన 23,000 కోట్ల రూపాయల విలువైన ప్యాకేజీ ని గురించి ప్రధాన మంత్రి వెల్లడిస్తూ, ఈ ప్యాకేజీ ఈశాన్య ప్రాంత రాష్ట్రాల లో ఆరోగ్య రంగ సంబంధిత మౌలిక సదుపాయాల కల్పన ను బలపరచడం లో సాయపడగలుగుతుందని పేర్కొన్నారు. ఈ ప్యాకేజీ ఈశాన్య ప్రాంత రాష్ట్రాల లో పరీక్షల నిర్వహణ, రోగ నిర్ధారణ, జన్యు క్రమ ఆవిష్కరణ లను శీఘ్రతరం చేస్తుందన్నారు. ఈశాన్య ప్రాంతం లో పడక ల సంఖ్య ను, ఆక్సీజన్ సంబంధిత సౌకర్యాల ను, శిశువైద్య సంరక్షణ సంబంధి మౌలిక సదుపాయాల ను వెంటనే పెంపొందించాలి అని ప్రధాన మంత్రి నొక్కిచెప్పారు. దేశం అంతటా పిఎమ్-కేర్స్ ద్వారా వందల కొద్దీ ఆక్సీజన్ ప్లాంటుల ను ఏర్పాటు చేయడం జరుగుతోందని, మరి ఈశాన్య ప్రాంతం లో కూడాను దాదాపు గా 150 ప్లాంటుల ను స్థాపించడం జరుగుతుందని ప్రధాన మంత్రి తెలిపారు. ఈ ప్లాంటుల ను ఏర్పాటు చేసే ప్రక్రియ ను వేగవంతం గా పూర్తి చేయవలసింది అంటూ ముఖ్యమంత్రుల కు ప్రధాన మంత్రి మనవి చేశారు.

ఈశాన్య ప్రాంత భౌగోళిక స్థితి కారణం గా తాత్కాలిక ఆసుపత్రి ని ఏర్పాటు చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని ప్రధాన మంత్రి ప్రముఖం గా పేర్కొన్నారు. బ్లాకు స్థాయి లోని రెండు ఆసుపత్రుల కు చేరుకోనున్న ఆక్సీజన్ ప్లాంటు లు, ఐసియు వార్డు లు, కొత్త యంత్రాల నిర్వహణ కు సిబ్బంది అవసరం అవుతారు కాబట్టి తదనుగుణంగా శిక్షణ పొందిన సిబ్బంది ని తయారుగా ఉంచుకోవాలి అని కూడా ఆయన సూచన చేశారు. కేంద్ర ప్రభుత్వం వైపు నుంచి అన్ని విధాలు గాను సహాయం అందుతుంది అంటూ ఆయన హామీ ఇచ్చారు.

దేశం లో ఒక రోజు లో 20 లక్షల పరీక్షల సామర్థ్యం సాధ్యపడిందని ప్రధాన మంత్రి వివరిస్తూ, ప్రభావిత జిల్లాల లో పరీక్షల నిర్వహణ తాలూకు మౌలిక సదుపాయాల కల్పన కు ప్రాధాన్యాన్ని ఇవ్వవలసిన అవసరం ఉందని ప్రముఖం గా పేర్కొన్నారు. నమూనా పరీక్షల తో పాటు పరీక్షల నిర్వహణ ను ముమ్మరం చేయాలి అని ఆయన స్పష్టం చేశారు. సమష్టి ప్రయాసల తో మనం సంక్రమణ ను అరికట్టి తీరగలుగుతాం అనే ఆశ ను ప్రధాన మంత్రి వ్యక్తం చేశారు.

# కౌశిక్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

**-.వేములవాడ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం**



రాజన్న సిరిసిల్ల, జులై 13: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో ని మంగళవారం రోజున యూత్ కాంగ్రెస్ బీసీ సెల్ ఆధ్వర్యంలో హుజురాబాద్ కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కనికరపు రాకేష్ నాగుల రాము మాట్లాడుతూ నిన్నటి రోజున కౌశిక్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని టీ పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మాణిక్య టాకూర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ పైన అనుచిత వ్యాఖ్యలు చేయడానికి తీవ్రంగా ఖండిస్తూ వెంటనే తెలంగాణ ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని యూత్ కాంగ్రెస్ తరపున డిమాండ్ చేస్తున్నారని వారన్నారు స్థాయిని మరిచి కౌశిక్ రెడ్డి మాట్లాడడం విడ్డూరంగా ఉందని వారన్నారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ వేములవాడ బ్రిడ్జి ముందు కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగిందని వారన్నారు. నీకు హుజురాబాద్ లో గత ఎమ్మెల్యే ఎలక్షన్ లో ఎన్ని ఓట్లు రావడానికి మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అని అది మర్చిపోయి మాట్లాడడం ఒక వివేకానికి నిదర్శనమని వారు అన్నారు ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు లింగంపల్లి కిరణ్, కోలకాని రాజు, దాడి మల్లేశం, వనపర్తి శంకర్, తోట రాజేష్, గుడిసె కర్ణాకర్, వస్తాదు కృష్ణ, మే0డే రాజు, మర్రిపల్లి రాజు, సందేళ దేవయ్య, యాదవ్, రాజేందర్, శీను, తదితరులు ఉన్నారు

# థర్డ్ వేవ్‌పై అలసత్వం తగదు : కేంద్రం హెచ్చరిక

న్యూఢిల్లీ, జులై 13:కరోనా థర్డ్ వేవ్ ప్రభావాన్ని ప్రపంచం చవిచూస్తోందని కొవిడ్-19 నిబంధనలను ఉల్లంఘిస్తే వైరస్‌పై పోరాటం నీరుకారుతుందని కేంద్ర ప్రభుత్వం మంగళవారం దేశ ప్రజలను అప్రమత్తం చేసింది. థర్డ్ వేవ్ ప్రపంచాన్ని తాకిందని, భారత్‌లో దాని ప్రభావం లేకుండా మనం జాగ్రత్తగా వ్యవహరించాలని స్పష్టం చేసింది. వైరస్‌ను కట్టడి చేసేందుకు కొవిడ్-19 ప్రొటోకాల్స్‌ను విధిగా అనుసరించాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ పేర్కొన్నారు.

దేశమంతటా మార్కెట్లలో రద్దీ, సిమ్లా, మనాలి, ముస్సోరి వంటి హిల్ స్టేషన్లలో పర్యాటకుల సందడిని ప్రస్తావిస్తూ కరోనా నిబంధనలకు తిలోదకాలు ఇస్తే వైరస్‌పై ఇప్పటివరకూ మనం చేసిన పోరాటం వృధా అవుతుందని హెచ్చరించారు. థర్డ్ వేవ్ గురించి తాము మాట్లాడుతుంటే ప్రజలు దాన్ని వాతావరణ అప్‌డేట్‌గా తేలికగా తీసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జులైలో వెలుగుచూస్తున్న మొత్తం కరోనా వైరస్ కేసుల్లో 73.4 శాతం కేసులు కేరళ, మహారాష్ట్ర , తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్నాటక నుంచే నమోదవుతున్నాయని చెప్పారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.